చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు 7

పర్యాటకంతోనే ప్రగతి



కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, జిల్లా షాన్‌మోహన్



- అభివృద్ధి జరగాలంటే పర్యాటకరంగం మరింత ఊపందుకోవాలి
- కాకినాడలో స్టార్‌హోటల్ గదులు మరిన్ని అందుబాటులోకి రావాలి
- 1,246ఎకరాల ఉప్పుభూములు కాలుష్యరహిత పరిశ్రమలకు కేటాయింపు
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో జిల్లా సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు
- ఉప్పాడ సముద్రపు కోత నివారణకు కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని సూచన
- జిల్లా ప్రగతిపై వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలపై కలెక్టర్ నివేదిక
- అన్నవరం-పిఠాపురం-సర్పవరం-కాకినాడబీచ్-హోప్‌ఐలాండ్-కోరింగ-సామర్లకోట-ద్రాక్షారామ పర్యాటక, ఆధ్యాత్మిక సర్క్యూట్ ప్రతిపాదన

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పర్యాటక రంగం అభివృద్ధి చెందితే జిల్లా ప్రగతి మరింత సాధ్యమవుతుంది. అందుకే ఈ రంగంపై అధికారులు మరింత దృష్టిసారించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో రెండోరోజు కలెక్టర్ల సదస్సు సందర్భంగా కాకినాడ జిల్లా ప్రగతి అంశాలపై కలెక్టర్ షాన్‌మోహన్ ప్రజంటేషన్ సందర్భంగా జిల్లా గురించి పలు కీలక అంశాలను సీఎం చర్చించారు. ఎకో టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ఆధ్యాత్మిక టూరిజం, అడ్వెంచర్ టూరిజం మరింత అభివృద్ధి జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పర్యాటకరంగం మరింత అభివృద్ధి సాధించాలంటే ప్రధానంగా హోటల్ గదులు ఎక్కువగా అందుబాటులో ఉండాలని, ఇందుకు అనువైన భూములను సిద్ధం చేస్తే పెట్టుబడిదారులకు చూపించడానికి కుదురుతుందని సీఎం వివరించారు. దీంతో కాకినాడలో సముద్ర తీరం వెంబడి 1,246 ఎకరాల ఉప్పు భూములు ఉన్నాయని కలెక్టర్ ఈసందర్భంగా వివరించగా, వాటిని రిజర్వు చేయండి అని ఆదేశించారు. వీటిని కాలుష్య రహిత పరిశ్రమలకు కేటాయిదామని ప్రతిపాదించారు. జిల్లాలోఉప్పాడ సముద్రపు కోతవల్ల వేల ఎకరాలు, వందలాది కుటుంబాలు నష్టపోయాయని, నాలుగు కిలోమీటర్లమేర రక్షణ గోడ నిర్మాణానికి రూ.332కోట్లు ఖర్చవుతుందని కలెక్టర్ వివరించారు. దీంతో ఈ నిధులను కేంద్రం నుంచి రాబట్టేందుకు ప్రయత్నించాలని కలెక్టర్‌కు సూచించారు.

జిల్లా అభివృద్ధి ప్రణాళిక ఇలా..

రాబోయే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిల్లా వివిధ రంగాల్లో ప్రగతి సాధించేందుకు అవసరమైన పలు కీలక అంశాలపై కలెక్టర్ సీఎంకు ప్రతిపాదనలు వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో భవిష్యత్తులో ఏమేం సాధించాలి? అనేదానిపై నివేదిక వినిపించారు. ప్రధానంగా ఏటా అక్టోబరు, నవంబరులో తుఫాన్లు, వరదల కారణంగా పంటలు నష్టపోతున్నాయని, ఈ నేపథ్యంలో జూన్ 1నుంచే ముందుగా సాగునీరు విడుదల చేస్తే నష్టం తగ్గుతుందని వివరించారు. తద్వారా అదనంగా మూడో పంట కింద పప్పుధాన్యాలు 20వేల హెక్టార్లలో సాగుచేయడానికి కుదురుతుందని, ఫలితంగా అన్నదాతలకు రూ.75కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. రబీలో ఏటా 19వేల హెక్టార్లలో పప్పుధాన్యాలను అదనంగా సాగు చేయాలని లక్ష్యంగా విధించుకున్నామని, దీనిద్వారా రూ.12కోట్ల ఆదాయం రైతులకు సమకూరనుందన్నారు. 2వేల హెక్టార్లలో ఆయిల్‌పాం సాగు అదనంగా చేయడంవల్ల జీవీఏ రూ.373కోట్లు అదనంగా వస్తుందన్నారు. డెయిరీఫాంలకు ఉత్పత్తి వ్యయం తగ్గించాలని తద్వారా రూ.36కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. అదనంగా 2,216 ఎకరాల్లో చేపలు, రొయ్యల ఉత్పత్తి చేపడితే 5,540 మెట్రిక్ టన్నులు వస్తాయన్నారు. కాకినాడ బీచ్ వెంబడి ఏడాదిలోగా పాం చెట్లను ఆరునెలల్లో నాటుతామన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ

పర్యాటక, ఆధ్యాత్మిక రంగం జిల్లాలో మరింత పెరగడానికి అవకాశం ఎంతో ఉందన్న కలెక్టర్ ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. కాకినాడనగరంలో 2 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో మూడు చోట్ల ఫోర్ స్టార్, ఫైవ్‌స్టార్ హోటళ్లు నిర్మించనున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ బీచ్‌వద్ద వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రూ.23కోట్లతో పీపీపీ కింద దానవాయిపేట బీచ్ అభివృద్ధి చేయడానికి కసరత్తు చేస్తున్నామని, అవన్నీ చేస్తే నెలకు 40వేల వరకు పర్యాటకులు వస్తారని కలెక్టర్ వివరించారు. అన్నవరం కొండపై రోప్‌వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే అన్నవరం- పిఠాపురం- సర్పవరం-కాకినాడబీచ్- హోప్‌ఐలాండ్- కోరింగ-సామర్లకోట-ద్రాక్షారామప్రాంతాలను కలిపి పర్యాటక, ఆధ్యాత్మిక సర్క్యూట్ అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 49స్కూళ్లలో అటల్ టింకరింగ్ యోజన కింద సైన్స్‌ల్యాబ్స్‌లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కాకినాడలో సైన్స్ సెంటర్‌ను 2027కి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. మత్తు రహిత జిల్లాగా కాకినాడను మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. డ్రగ్స్ వాడేవారిపై నిఘాకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఇసుక కొరత లేకుండా..

జిల్లాలో చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందేలా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో ఎంఎస్ఎంఈ పార్కు వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిశ్రమల కోసం కాకినాడ సెజ్‌లో 5,192 ఎకరాలు, ఉప్పు భూములు 1,246ఎకరాలు, 91 ఎకరాలు ఏపీఐఐసీ భూములు సిద్ధంగా ఉన్నాయన్నారు. రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఇళ్లపై ప్రోత్సహించడంతోపాటు పీఎం కుసుం కింద రూ.89.77కోట్లతో ఫీడర్ లెవెల్ సోలార్ స్టేషన్‌లను 12నెలల్లో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. జిల్లాలో అయిదు ఇసుక డిపోల్లో జూన్ ఆఖరుకు 50వేల టన్నుల ఇసుక సిద్ధం చేసి కొరత లేకుండా చేస్తామని స్పష్టం చేశారు.

ఉద్రిక్తత..ఉత్కంఠ

- రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రివద్ద రోజంతా టెన్షన్
- పాస్టర్ ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు

7

రేపు ఇఫ్తార్ విందు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 28న సాయంత్రం 5.30గంటలకు ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ ఉపవాస దీక్ష సందర్భంగా ప్రభుత్వం తరఫున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు,ముస్లింపెద్దలు, జిల్లా అధికారులు హాజరుకావాలన్నారు.

పీఎం యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడఅర్బన్, మార్చి26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయిలో యోగా అభివృద్ధికి అత్యుత్తమ కృషి చేసిన వారికి 2025 సంవత్సరానికి ప్రధానమంత్రి యోగా అవార్డుకు అర్హులైనవారినుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా క్రీడాప్రాధికారసంస్థ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. నిష్కళంకమైన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఉమ్మడిజిల్లాలో అర్హతగలవారు ఈనెల 31లోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు పంపించవచ్చన్నారు.

నేడే ఉప ఎన్నికలు



- జిల్లాలో ఐదు గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ స్థానాలకు, కాకినాడ రూరల్ ఎంపీపీ స్థానానికి ఎన్నికలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు గ్రామపంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు గురువారం నిర్వహిస్తున్నారు. దీనిలో పెదపూడి మండలం రామేశ్వరం గ్రామ పంచాయితీ, తుని మండలం దొండవాక, సామర్లకోట మండలం పి.వేమవరం, తొండంగిమండలం పైడికొండ, ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈఐదు గ్రామ పంచాయతీల్లో వివిధ కారణాల నేపథ్యంలో ఉపసర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 11గంటలకు ఉపసర్పంచ్ ఎన్నిక జరగనుంది. ఈఎన్నికల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారుల సమక్షంలో ఎన్నిక నిర్వహిస్తారు. కాకినాడ రూరల్ ఎంపీపీ స్థానానికి కూడా ఎన్నిక నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

కాకినాడ రూరల్ ఎంపీపీ ఎన్నిక..

జనసేనకు ప్రతిష్ఠాత్మకం

- మొత్తం 18మంది ఎంపీటీసీల్లో 10మంది మద్దతు ఆ పార్టీకే..

సర్పవరంజంక్షన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎంపీపీ పదవికి ఎన్నికల అధికారి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ మండలంలో 18 ఎంపీటీసీ సభ్యుల్లో 10మంది జనసేన వైపు ఉన్నారు. వైసీపీలో 8మంది ఉన్నారు. వైసీపీకి చెందిన ఎంపీపీ పదవి గోపిశెట్టి పద్మజ తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికల సంఘం గురువారం ఎన్నిక నిర్వహిస్తోంది. గతంలో వైసీపీకి 15మంది ఎంపీటీసీలు ఉండగా, జనసేనకు ముగ్గురు సభ్యులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జనసేనకు చెందిన ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రాతినిథ్యం వహిస్తుండడంతో ఈ ఎన్నిక ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇటీవల ఏడుగురు వైసీపీ ఎంపీటీసీలు స్వచ్ఛందంగా జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

ఎన్నిక లాంఛనమే అయినా..

రూరల్ ఎంపీపీ పదవి సంఖ్యా బలాన్ని బట్టి పరిశీలిస్తే 10మంది సభ్యులతో జనసేనకే దక్కనుంది. పండూరు ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మిని ఎంపీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే నానాజీ ఖరారు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వైసీపీలో ఉన్న 8మంది సభ్యుల్లో ఒకరితో ఎంపీపీ పదవికి నామినేషన్ వేయించేందుకు కన్నబాబు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఏడుగురు జారిపోవడంతో కనీసం నామినేషన్ వేయించిఅయినా పరువు కాపాడుకోవాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీలతోపాటు ఎక్స్-అఫీషియో సభ్యులను మాత్రమే అనుమతిస్తామని ఎన్నికల అధికారిణి అడపా వెంకటలక్ష్మి తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీటీసీ, కోఆప్షన్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా పాల్గొంటారన్నారు. ఎంపీపీ ఎన్నిక ఉదయం11గంటలకు ప్రారంభిస్తామని, ముందుగా నామినేషన్లు స్వీకరిస్తామని, ఒకటి కంటే ఎక్కువవస్తే ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నిక ముగిసే వరకు మండల కార్యాలయం పరిసరాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు తెలిపారు.

నెరవేరనున్న కల



పిఠాపురం నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరబోతోంది. పిఠాపురంలో ఆర్వోబీ నిర్మాణానికి రూ.సీఆర్ఐఎఫ్-సేతు బంధన్ పథ కం ద్వారా రూ.59.70కోట్లతో పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే భూసేకరణకు రూ.37కోట్లు మంజూరయ్యా యి. ఏడాదిలోగా ఆర్వోబీ పనులు చేపడతామని ఎన్నికలకు ముందు, తర్వాత పిఠాపురంలో నిర్వహించిన బహిరంగసభల్లో ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆ దిశగా చొరవ తీసుకోవడంతో కూటమి ప్రభుత్వం పనులకు పచ్చజెండా ఊపింది. టెండర్లు పిలిచిన అనంతరం పనులు ప్రారంభం కానున్నాయి.

పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ రైల్వేగేటు

- పిఠాపురం ఆర్వోబీ నిర్మాణానికి రూ.59.70కోట్లు కేటాయింపు
- సేతుబంధన్ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్
- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే భూసేకరణకు రూ.37కోట్లు మంజూరు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో కదలిక
- ఏడాదిలోగా పనులు ప్రారంభిస్తామని గతంలో ప్రకటన

ఆంధ్రజ్యోతి/పిఠాపురం:

పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ రైల్వేగేటు ద్వారా నిత్యం వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఇదే గేటు మీద నిత్యం 80రైళ్ల రాకపోకలు జరుగుతాయి. రైల్వేగేటు వేసిన సమయాల్లో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ఆస్పత్రులకు వెళ్లే రోగులు, వివిధ పనులు నిమిత్తం రాకపోకలు సాగించే ప్రజలు, రైల్వేగేటుకు అవతల ఉండే పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఉప్పాడ రైల్వేగేటువద్ద రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అప్పటినుంచి ఇది కార్యరూపం దాల్చలేదు. తొలుత రూ.35కోట్లు, తదనంతరం రూ.50కోట్లుగా ఉన్న ఆర్వోబీ అంచనావ్యయం మరింత పెరిగింది. చివరకు రూ.85కోట్లకు చేరింది.

ఎన్నికలకు ముందు పవన్ హామీ

ఉప్పాడ రైల్వేగేటు(లెవిల్ క్రాసింగ్ నెంబరు 431) మీదుగా ఆర్వోబీ నిర్మాణ పనులను ఏడాదిలోగా చేపడతామని ఎన్నికలకు ముందు, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం డిప్యూటీ సీఎం హోదాలో పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఇచ్చిన హామీఅమలుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు వేగంగా కదిలేలా చేశారు. పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.


పనులు ఇలా..

ఉప్పాడ రైల్వేగేటువద్ద 700 మీటర్ల పొడవునా రైల్వేఓవర్‌బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణాన్ని సేతు బంధన్-కేంద్ర రోడ్ల మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) పథకం కింద రూ.59.70కోట్లు మంజూరుచేస్తూ, నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ పరిపాలనా అనుమతులను ఇస్తూ మంగళవారం జీవో జారీ చేసింది. ఇప్పటికే ఆర్వోబీకోసం 3.50 ఎకరాలభూసేకరణ, భవనాల తొలగింపు పరిహారం కోసం రూ.37కోట్లు, ఇతరత్రా నిర్వహణా ఖర్చులకు రూ.2కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఇక టెండర్లు పిలవడమే తరువాయి

ఇప్పటికే భూసేకరణ ప్రక్రియకు సంబంధించి పలుమార్లు రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపారు. ఆర్వోబీ నిర్మాణంవల్ల భూములు, భవనాలు, దుకాణాలు, షాపులు కోల్పోయే వారితో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. నోటిఫికేషన్ జారీ అనంతరం నష్టపరిహారం మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తారు. ఆర్వోబీ నిర్మాణానికిగాను టెండర్లను పిలవనున్నారు. ఈ ప్రక్రియను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది. కాగా, ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు.

పిఠాపురం అభివృద్ధిలో మరో ముందడుగు: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్




పిఠాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఉప్పాడ రైల్వేగేటువద్ద ఆర్వోబీ నిర్మాణానికి రూ.59.70కోట్లతో పరిపాలన మంజూరు లభించడం ఎంతో ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ సీఎం కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేసింది. ఎన్నికల సమయంలో ఈ వంతెన నిర్మాణానికి తాను హామీఇచ్చిన విషయాన్ని పవన్ గుర్తుచేశారు. సామర్లకోట-ఉప్పాడ ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిలో పిఠాపురం పట్టణ పరిధిలో ఈ రైల్వేలెవిల్ క్రాసింగ్‌వల్ల ప్రజలు ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే రాకపోకలు సులభతరమవుతాయని తెలిపారు. ప్రజల ప్రయాణ సమయం ఆదా అవుతుందని చెప్పారు. ఈ ఆర్వోబీని కేంద్ర రహదారుల మౌలిక వసతుల నిధి(సీఆర్ఐఎఫ్)-సేతుబంధన్ పథకంలో భాగంగా చేపడుతున్నట్లు తెలిపారు.ఆర్వోబీకి నిధులుమంజూరు చేసి అండగా నిలిచిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం చంద్రబాబు, ఆర్అండ్‌బీశాఖ మంత్రి జనార్థనరెడ్డిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

పదో తరగతి పరీక్షకు 342 మంది గైర్హాజరు

కాకినాడ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 142 పరీక్షాకేంద్రాల్లో బుధవారం జరిగిన పరీక్షకు 28,618మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 28,276 మంది హాజరుకాగా 342 మంది గైర్హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. జిల్లా పరిశీలకులు 4, అసిస్టెంట్ కమిషనర్ 3,డీఈవో 3, తనిఖీ అధికార్లు 28పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. ఓపెన్ స్కూల్ సైన్స్ పరీక్షకు 2240మంది హాజరుకావాల్సిఉండగా 2044మంది హాజరయ్యారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు కాజేశారు

- కలెక్టర్, ఎస్పీలకు బాధితుల ఫిర్యాదు
- డిప్యూటీ సీఎం చొరవ తీసుకుని ఆదుకోవాలని వేడుకోలు



వినతిపత్రాలు చూపుతున్న బాధితులు

ప్రత్తిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.4.5లక్షల కాజేశారని బాధితులు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని తమకు న్యాయం చేకూర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బాధితులు బుధవారం ప్రత్తిపాడులో మీడియా సమావేశం నిర్వహించి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ప్రత్తిపాడుకు చెందిన బొడ్డు వరలక్ష్మి కుమారుడు బొడ్డు రమేష్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఇదే మండలంలోని పెద్దిపాలేనికి చెందిన గొంప రామకృష్ణ, అతడి భార్య దుర్గాప్రవీణ మూడేళ్ల క్రితం రూ.4.5లక్షలు తీసుకుని మోసం చేశారన్నారు. ఎప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు ఇవ్వాలని కోరగా మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై గతంలో ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు. రుణాలు చేసి ఉద్యోగం కోసం ఇచ్చిన సొమ్ములు తిరిగి ఇప్పించాలని దీనిపై డిప్యూటీ సీఎం స్పందించి చర్యలు తీసుకోవాలి బాధితులు కోరారు.

టీటీసీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలి: డీఈవో

కాకినాడ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి):జిల్లాలో టెక్నికల్ టీచర్స్ కోర్సు(టీటీసీ) 42 రోజుల వేసవి ట్రైనింగ్ కోర్సుకు ఆన్‌లైన్లో ఏప్రిల్ 3 నుంచి 25 వరకూ దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.1000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. వేసవి శిక్షణా తరగతులకు మే 1నుంచి హాజరుకావాలన్నారు.

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

- లారీ చక్రాల కింద పడి ఇద్దరు మృతి
- మహిళకు తీవ్ర గాయాలు
- జగ్గంపేట మండలం జె.కొత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం

7

పాసింజర్ ఆటోను ఢీకొన్న వ్యాన్

7

ఆహా..రం!





ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రస్తుతం చాలా మంది నోట ఈ మాట వింటున్నాం.. ఆరోగ్యం వస్తుందంటే ఖర్చుకు అసలు వెనుకాడడంలేదు.. ఎంతయినా ఖర్చు పెడుతున్నారు.. ఆహారం తింటున్నారు.. దానికి డ్రైఫ్రూట్స్ వినియోగమే కారణం.. కొవిడ్ తర్వాత అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి.. ప్రతి నెలా బడ్జెట్ లో డ్రైఫ్రూట్స్ చేరిపోయాయి.. అంతే కాదు.. ఆన్‌లైన్‌లో అమ్మకాలు వచ్చేశాయి.. దానికి తగినట్టు దుకాణాలు వెలిశాయి.. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో ముస్లింలు ఎక్కువగా వినియోగిస్తారు.. అసలు డ్రైఫ్రూట్స్ తింటే ఉపయోగం ఏంటి.. అందులో ఉన్న రహస్యమేంటి అనేదానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ధరలిలా..

ఖర్జూరం కిలో రూ.90 నుంచి రూ.3 వేల వరకూ ఉంటాయి. నాణ్యత, రుచిని బట్టి రేటు ఫిక్స్ చేస్తారు. బాదం, పిస్తా వంటి ధరలు కిలో రూ.1,000 నుంచి రూ.1600 పైనే ఉంటాయి. అరబ్ దేశాల్లోను నాణ్యత గ్రేడింగ్ ఉంటుంది. నెంబర్-1 క్వాలిటీ గ్రేడ్-1 ధర ఎక్కువగా ఉంటే నెంబర్ 2, 3 గ్రేడింగ్ ధర తక్కువగా ఉంటుంది. దీన్ని బట్టి రేటు ఉంటుంది. అంజీర, పిస్తా, బాదం, అక్రూట్ తదితర రకాలు కేజీ రూ.వెయ్యిపైనేఉంటాయి.



జీడిపప్పు.. ఎక్కడెక్కడి నుంచంటే..

జీడిపప్పును ఇంతకు ముం దు శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం అక్కడి రోస్టెడ్ జీడిపప్పుపై బ్యాన్ విధించడంతో అక్కడి నుంచి బాయిల్డ్ జీడిపప్పును మాత్రమే దిగుమతి చేసుకుంటున్నారు. కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం మోరి నుంచి, ప్రకాశం జిల్లా వేటపాలెం నుంచి జీడిపప్పును తెచ్చి విక్రయిస్తున్నట్టు డ్రైఫ్రూట్స్ వ్యాపారులు చెబుతున్నారు. 320 కౌంట్ ధర (కిలోకి 320 పిక్కలు తూగుతాయి) ధర రూ.900-1100 మధ్య ఉంటుంది. 220 కౌంట్ ధర రూ.1100-1300 మధ్య ఉంటుంది. 180 కౌంట్ ధర రూ.1500-1800 వరకు ఉంటుంది.

- పెరిగిన డ్రైఫ్రూట్స్ వినియోగం
- పట్టణాలు.. పల్లెల్లోనూ దుకాణాలు
- రంజాన్‌లో ముస్లింలకు అదే ఆహారం
- ఎక్కడెక్కడి నుంచో దిగుమతులు
- కొవిడ్ తరువాత నుంచి ప్రజల్లో చైతన్యం
- అంతగా అమ్మకాల్లేవంటున్న వ్యాపారులు



డ్రై ఫ్రూట్స్..ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్, అంజీరా, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్ వినియోగం బాగా పెరిగింది. ఒకప్పుడు ధనికుల ఇళ్లల్లోనే ఎక్కువగా కనిపించేవి. ఉన్నత వర్గాలు వీటిని తినడం స్టేటస్ సింబల్‌గా భావించేవారు.మారుతున్న జీవన పరిస్థితుల్లో ఆరోగ్యంకోసం సాధారణ, మధ్యతరగతి ప్రజల్లోనూ వీటి వినియోగం కొంత పెరిగింది. డాక్టర్లు,ప్రకృతి వైద్యులు వీటిని తీసుకోవాలని ఎక్కువగా సూచిస్తుండడంతో చాలా మందికి డ్రైఫ్రూట్స్ దైనందిన జీవనంలో ఒక భాగంగా మారిపోయింది. ప్రధానంగా కరోనా మహమ్మారి తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. దీంతో డ్రైఫ్రూట్స్ వినియోగంపట్ల చైతన్యం పెరిగింది.ఖర్చుకు వెనుకాడడం లేదు.ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజాలు పుష్కలంగా లభిస్తుంది. వీటి వల్ల ఇమ్యూ నిటీ పెరుగుతుంది.రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ డ్రైఫ్రూట్స్ వినియోగం సాధారణ రోజుల్లో కంటే రంజాన్‌వేళల్లో అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం అర్బన్/కాకినాడ

పల్లెలకూ షాపులు..

జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాలతో పాటు అమలాపురం, మండపేట, సామర్లకోట, పెద్దాపురం, రావులపాలెం, రామచంద్రపురం, అనపర్తి పిఠాపురం, పలు గ్రామాల్లోనూ డ్రైఫ్రూట్స్ వ్యాపారం బాగా పెరిగింది. కొవిడ్ తర్వాత ప్రజలు వీటి వాడకాన్ని పెంచారు. అంతకు ముందు అంతంతమాత్రంగా అమ్మకాలు జరిగేవి. కేవలం బాదంపప్పు, జీడిపప్పులను మాత్రమే కొనుగోలు చేసేవారు. కానీ నేడు అన్ని రకాల డ్రైఫ్రూట్స్‌ను కొనేవారి సంఖ్య పెరిగింది. ప్రస్తుతం కాకినాడ నగరంలో పది పెద్ద దుకాణాల్లో ప్రత్యేకించి డ్రైఫ్రూట్స్ మాత్రమే విక్రయిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని శ్రీ వెంకటేశ్వర జనరల్ మార్కెట్, దివాన్‌చెరువు వంటి ప్రాంతాల్లో డ్రైఫ్రూట్స్ షాపులు పెద్దసంఖ్యలో ఏర్పాటయ్యాయి. రాజమహేంద్రవరంలోని మునిసిపల్ స్టేడియం చుట్టూ హోల్‌సేల్ డ్రైఫ్రూట్ షాపులు ఎక్కువగా కనిపిస్తాయి. ఒక్క రాజమహేంద్రవరంలోనే 25 కుపైగా హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. నగరాల్లో సాధారణ షాపులతోపాటు మోర్, రిలయన్స్ డీమార్ట్ వంటి షాపింగ్ మాల్స్‌లోను వీటిని ప్రత్యేకించి విక్రయిస్తుండడం విశేషం.

తింటే..ఆరోగ్యం

అరబ్ దేశాల నుంచే భారీగా దిగుమతులు

బాదం, పిస్తా, ఖర్జూరం, అంజీరా, వాల్‌నట్స్, అప్రికాట్ వంటి డ్రై ఫ్రూట్స్ రకాలన్నీ అరబ్ దేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితుల రీత్యా మన దేశంలో వీటి సాగు దాదాపుగా లేదు. మనదేశంలో ఒక్క కిస్‌మిస్ మాత్రం కొంత మేర దొరకుతుంది. మహారాష్ట్రలోని షాంఘ్లి నుంచి కిస్‌మిస్ దిగుమతి చేసుకున్నా చాలా తక్కువ క్వాంటిటీలోనే లభిస్తోంది. అరబ్ దేశాలైన ఇరాన్, ఇరాక్‌తో పాటు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి అరబ్ దేశాల నుంచి ఢిల్లీ, ముంబయికి చెందిన హోల్‌సేల్ వ్యాపారులు డ్రైఫ్రూట్స్‌ను తీసుకొస్తారు. అక్కడి నుంచి వయా హైదరాబాద్ టు రాజమహేంద్రవరం తీసుకొస్తారు. పిస్తా అమెరికా, అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఎక్కువ అరబ్‌దేశాల నుంచే దిగుమతి అవుతోంది. ఖర్జూరంలో అనేక వెరైటీలు ఉన్నాయి.



అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి..

కొవిడ్ తర్వాత డ్రైఫ్రూట్స్ వాడకం ఎక్కువైన మాట వాస్తవమే. దానికి తగినట్టు షాపులు పెరిగాయి.. గతంలో డ్రై ఫ్రూట్స్ షాపులు చాలా తక్కువగా ఉండేవి. నేడు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. మాల్స్‌లో కూడా లభ్యమవుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు డ్రై ఫ్రూట్స్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే ఈ ఏడాది అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాధారణ రోజులతో పోల్చితే ఒక్కో ఐటమ్‌కు రెండు, మూడు కిలోలు మాత్రమే అదనంగా వ్యాపారం పెరిగిందన్నారు. - **వ్యాపారి, రాజమహేంద్రవరం**



ఖర్జూరంతో ఆరోగ్యం

ఖర్జూరాలు బరువు పెరగడం, కండరాల అభివృద్ధి,గాయాల నుంచి కోలుకోవడం, రక్తపోటును తగ్గించడం, జీర్ణక్రియను క్రమబద్ధీకరించడం, కంటి ఆరోగ్యం మొదలైన వాటిలో సహాయ పడతాయి. కాల్షియం, కాపర్, ఫోలేట్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, నియాసిన్, పాస్పరస్, పొటాషియం, రిబోఫ్లావిన్, సల్ఫర్, థయామిన్, జింక్, విటమిన్-ఏ లభిస్తాయి. ఖర్జూరంలో శరీరానికి మేలు చేసే వివిధ ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలంగా ఉన్నాయి. ఖర్జూరాన్ని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది.

ఎన్నెన్నో రకాలు..

ఖర్జూరంలో చాలా రకాలు ఉన్నాయి. డెగ్లట్ నూర్, మెడ్జూల్, ఖాద్రావి, హనీ, బ్లాక్ డేట్, గోల్డెన్ ప్రిన్సెస్,ఒమానీ, కల్మీ, ఖుద్రీ, జహీదీ, హలవీ ఇలా అనేక రకాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా అమెరీ డేట్స్, అజ్వా డేట్స్, అమెరికన్ డేట్స్, హార్మనీ డేట్స్ ప్రత్యేకం. రంజాన్ మాసంలో ఖర్జూరానికి ప్రాధాన్యత ఉంది. సూర్యాస్తమయ సమయంలో కుటుంబాలు ఇఫ్తార్‌తో ఉపవాసం విరమిస్తారు. సంప్రదాయక ముస్లింలు మూడు ఖర్జూరాలతో ఉపవాసం విరమించే ఆచారాన్ని గుర్తు చేసుకోవడానికి వీటిని తినడం ద్వారా భోజనం ప్రారంభిస్తారని కాకినాడకు చెందిన డ్రై ఫ్రూట్స్ వ్యాపారి శ్రీనివాస్ తెలిపారు.వీటి ధరలు అజ్వా డేట్స్ ధర 250 గ్రాములు రూ.900, మెడ్జూల్ ధర కిలో రూ.2500, అమెరీ డేట్స్ కిలో రూ.1800 వరకు ఉంటున్నాయి. ఇవి పూర్తిగా ముంబై నుంచి ఇంపోర్ట్ చేసుకుంటున్నట్టుగా వ్యాపారులు చెబుతున్నారు.

సనాతన ధర్మమంటే ఏమిటో చెప్పాలి

- పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురంటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చేగువేరా వారసుడిని అని చెప్పి రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కల్యాణ్ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినట్టు నడుచుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేడు సనాతన ధర్మం గురించి ఆయన మాట్లాడుతున్నారని అసలు సనాతన ధర్మమంటే ఏమిటో చెప్పాలన్నారు. ఇప్పటికే సమాజంలో కులవ్యవస్థ అంతకంతకూ పెరిగిపోతుందన్నారు. సనాతన ధర్మమంటే మనుధర్మాన్ని అమలు చేయడమా అన్నారు. అన్నమయ్య, పోతన, రామానుజాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సమతావాదులకు తామంతా వారసులమన్నారు. వారంతా మన జాతి సంపద అని, మేము సగర్వంగా చెప్పుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మనుధర్మాన్ని అమలు చేస్తామంటే సహించబోమన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చని కోనసీమలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందన్నారు. పలుచోట్ల పైపులైన్లు, ట్యాప్‌లు వేసినప్పటికీ చుక్కనీరు సరఫరా చేయని దుస్థితి నెలకొందన్నారు. పంటకాల్వలు, డ్రైనేజీలుగా మారిపోయాయని, ఆక్వా కెమికల్ వ్యర్థాలతో వ్యవసాయం కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో ఎన్నో సమస్యలను గుర్తించామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కనీసం దోమతెరలు కూడా అందించడం లేదన్నారు.మంత్రి నాదెండ్ల మనోహర్ హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని హామీఇచ్చి ఇంతవరకు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా డీఎస్సీ నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. పీ-4 పథకం కేవలం పేదలను బిచ్చగాళ్లను చేయడం కోసమేనని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరామ్, జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

గేట్‌లో యూసీఈకే విద్యార్థుల ప్రతిభ

- 86 మందికి ర్యాంకులు

జేఎన్టీయూకే, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గేట్-2025 పరీక్షల్లో కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్. మోహన్‌రావు తెలిపారు. ఈసీఈ విద్యా ర్థులు సీహెచ్ సాయిచరణ్ 9వ ర్యాంకు, సివిల్ నుంచి ఐదుగురు విద్యార్థులు 1000 నుంచి 20,000లోపు, ఈఈఈ నుంచి 20 మంది 11 నుంచి 50,000లోపు, మెకానికల్ నుంచి 9 మంది 500 నుంచి 10,000లోపు ర్యాంకులు పొందారన్నారు. అదేవిధంగా ఈసీఈ నుంచి 28 మంది 9 నుంచి 50,000లోపు, సీఎస్ఈ నుంచి 15 మంది 100నుంచి 50,000లోపు, పీఈ సీఈ నుంచి 9 మంది 50 నుంచి 5000 లోపు ర్యాంకులు సాధించారన్నారు. మొత్తం 86 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బోటు బిల్డింగ్ యార్డ్ లీజు రద్దుచేయాలి

- ప్రభుత్వమే నిర్వహణ చేపట్టాలి
- ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

కాకినాడ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిన కాకినాడ బోటు బిల్డింగ్ యార్డు లీజు రద్దుచేసి మత్స్యశాఖ ఆధీనంలో ప్రభుత్వమే నిర్వహణ చేపట్టాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు కోరారు. స్థానిక జగన్నా ధపురంలోని ఎస్ఐఎఫ్‌టీ భవనంలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బలసాడి రంగారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి, డిప్యూటీ డైరెక్టర్ వి.కృష్ణారావు, జిల్లా మత్స్య సహకార సంఘం ఎండీ, అసిస్టెంట్ డైరెక్టర్ కె. కరుణాకరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ప్రధానమంత్రి మత్స్యకార యోజన పథకాన్ని రెండేళ్లు పొడిగించడంపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌లోని ఆప్‌కాబ్ డీజిల్ బంక్ నిర్వహణను జిల్లా మత్స్య సహకార సంఘానికి అప్పగించాలని, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నేతృత్వంలో సీఎంను త్వరలో కలిసి మత్స్యకార సమస్యలు విన్నవించాలని, బోటు బిల్డింగ్ యార్డును ప్రభుత్వమే నిర్వహించాలని తీర్మానాలు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రంగారావు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే కొండబాబు హయాంలో రూ.6కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఆధునీకరించిన బోటు బిల్డింగ్‌యార్డులో కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఈ అభివృద్ధి పనులు పూర్తి చేయించేందుకు ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సంఘం వైస్ చైర్మన్ కొల్లు రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు అంపోలు సత్యనారాయణ, బోర్డు డైరెక్టర్లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో గరుడవాహన సేవ

- కొనసాగుతున్న స్వామివారి అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు బుధవారరం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గోదావరి జలాలను తీసుకువచ్చి స్వామివారికి మేల్కొలుపు నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో పండితులు ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతా ల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అధ్యయనోత్సవాలలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు భక్తులను అలరించింది. సాయంత్రం వేద పారాయణం నిర్వహించారు. మేళతాళ మంగళవాయిద్యాలు నడుమ శ్రీవారు గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాడపల్లిలో గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవల కోసం మరో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. ఒకరు ఆరోగ్యంగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం ఐదుగురు బాధితులు చికిత్స పొందుతున్నారన్నారు. జీబీఎస్ కేసులకు వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి భయాందోళనకు గురవ్వరాదన్నారు.

హుండీల ఆదాయం రూ.15లక్షలు

ఐ.పోలవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం 110రోజులకు రూ.15,73,843లు వచ్చినట్టు ఆలయ ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.8,75,849లు, నిత్యకళ్యాణం, కట్నకానుకల ద్వారా రూ6.04లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.93,061లు సమకూరినట్టు తెలిపారు. మూడు విదేశీ నోట్లు కూడా వచ్చాయన్నారు. అమలాపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు.

వర్షపు నీటిని సంరక్షించాలి

- పర్యావరణవేత్త వెంకట యాదవ్
- 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అందరూ తమ ఇంటిపై పడిన వర్షపు నీటిని తామే సంరక్షించుకుంటే నీటి కోసం యుద్ధాలు అవసరం లేదని హైదరాబాద్‌కు చెందిన పర్యావరణవేత్త సిద్దనబోయిన వెంకట యాదవ్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నీటి సంరక్షణ, భవిష్యత్ సవాళ్ల అనే అంశంపై బుధవారం నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌కు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, సిద్దనబోయిన ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలనతో సభను ప్రారంభించారు. సిద్దనబోయిన మాట్లాడుతూ మన ఇంటి కింద 1.50 లక్షల లీటర్ల నీరు పట్టే సంపుతో ఇంటి నిర్మాణం చేపట్టాలని, ఇది నేటి కాలంలో చాలా ప్రాంతాల్లో ఆదర్శంగా నిలిచిందన్నారు. నన్నయ వర్శిటీని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామన్నారు. వీసీ మాట్లాడుతూ సరిపడ నీరు తాగకపోతే శరీరంలో అవయవాలు పాడవుతాయన్నారు. యూనివర్శిటీలో నీటిఎద్దడి అధికంగా ఉందని, దానిని అధిగమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వెంకటయాదవ్ సహకారంతో పర్యావరణ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం పర్యావరణం, నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోటీల్లోని విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్, వర్శిటీ ఇంజనీర్ కె.నూకరత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల ఆదాయం రూ.14.91 లక్షలు



బిక్కవోలులో లక్ష్మీగణపతి ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

బిక్కవోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయాల హుండీలను బుధవారం లెక్కించగా రూ.14.91లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. రామచంద్రపురం తనిఖీ అధికారి ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో శ్రీలక్ష్మీ గణపతి హుండీల నుంచి రూ.10,97,441, శ్రీగోలింగేశ్వరస్వామి హుండీల నుంచి రూ.3,96,859 ఆదాయ వచ్చిందని తెలిపారు. మూడు నెలల 20 రోజులకుగాను ఈ ఆదా యం లభించినట్టు ఈవో పేర్కొన్నారు.

28, 29 తేదీల్లో ఐడియల్‌లో జాతీయస్థాయి సదస్సు

కాకినాడ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ సామర్లకోట్టరోడ్డులోని ఇంద్రపాలెంలాకుల వద్దఉన్న ఐడియల్ డిగ్రీకళాశాలలో ఈనెల 28,29 తేదీల్లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ సదస్సు చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి తెలిపారు. కళాశాల రసాయన, భౌతికశాస్త్ర విభాగాల ఆధ్వర్యం లో కన్వర్జెన్స్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ నానోమెటీరియల్స్ అండ్ నానో టెక్నాలజీ అనే అంశంపై రెండురోజుల పాటూ ఈ సదస్సు జరుగుతుందన్నారు. దీనిలో ముఖ్యఅతిథులుగా దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వివిధ విశ్వవిద్యాలయాల సీనియర్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. వివిధ యూనివర్శిటీలు, కళాశాలల ప్రొఫెసర్లు, అధ్యాపకులు తమ పేపర్లను అందజేయాల ని కోరారు. ఈ సదస్సుకు ప్యాట్రన్‌గా కళాశాల ప్రిన్సిపా ల్ డాక్టర్ టి.సత్యనారాయణ, కన్వీనర్‌గా కెమిస్ట్రీ విభాగాధిపతి కె.రాజేంద్రకుమార్, సమన్వయకర్తగా ఫిజిక్స్ విభాగాధిపతి జి.రాజు, సహ సమన్వయకర్తగా బి.శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా ప్రసాద్, నిర్వహణ కమిటీ సభ్యులుగా సిరి, జ్యోతి, సా యి కళ్యాణి వ్యవహరించనున్నారన్నారు.

శృంగారవల్లభస్వామి దేవస్థానం షాపులకు వేలం

- రూ.10.57లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆశీల పాట ద్వారా పంచాయతీకి రూ.10.57 లక్షలు సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి ఒగ్గు భార్గవ్ తెలిపారు. శృంగారవల్లభస్వామి దేవస్థానానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు నిమిత్తం రూ.6.60 లక్షలకు లక్కరాజు రామకృష్ణ, దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు సంబంధించి రూ.3.97లక్షలు దంటు వీరబాబు దక్కించుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తత... ఉత్కంఠ!

- రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా టెన్షన్ టెన్షన్
- భారీగా మోహరించిన పోలీసులు
- పోస్టుమార్టం అనంతరం పాస్టర్ ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా ఉద్రిక్తత, ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవులు, ప్రవీణ్ ఫాలోవర్స్‌తో పాటు తెలంగాణ జిల్లాలు, ఖమ్మం ప్రాంతానికి చెందిన క్రైస్తవ ప్రముఖులు పెద్దసంఖ్యలో ఆసుపత్రికి చేరుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్ప డ్డాయి. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో క్రైస్తవ విశ్వాసులు పెద్దసంఖ్యలో మోకాలి ప్రార్థనలతో, నినాదాలతో ప్రవీణ్‌కు న్యాయం జరగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అన్ని ఫార్మాలిటీస్ ముగిసిన అనంతరం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకుని శాంతిభద్రతలు, ఇతర అంశాలను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా ఆసుపత్రికి వచ్చి బాధిత క్రైస్తవ సంఘీయులకు న్యా యం జరిగేలా చూస్తామని ప్రకటించారు. ప్రవీణ్ పగడాల మృతి విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని, మృతి కారణాలు సాధ్యమైనంత త్వరగా బయటకు వస్తాయన్నారు. కాగా ప్రభుత్వ బోధనాసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టులో ప్రవీణ్ మృతదేహానికి శవ పంచనామా జరిపారు. అనంతరం మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ మొత్తం సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగడంతో ఆసుపత్రి ఆవరణతోపాటు మెయిన్‌గేటు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

కేపీ పాల్‌ను అడ్డుకున్న పోలీసులు

సాయంత్రం మూడున్నర ప్రాంతంలో ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేపీ పాల్ రాజమహేంద్రవరం ప్రభుత్వబోధనాసుపత్రికి చేరుకున్నారు. అక్కడి నుంచి పోస్టుమార్టం జరుగుతున్న మార్చురీగది లోపలకు వెళ్లడానికి ప్రయత్నించగా కేపీ పాల్‌ను పోలీసులు అనుమతించలేదు. ఈ సమయంలో కేపీ పాల్‌కు, మాజీ ఎంపీ హర్షకుమార్ తనయునికి కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఆసుపత్రి మార్చురీ వద్ద కేపీ పాల్ హైడ్రామా కొనసాగింది. ఓపెన్‌టాప్ జీపుపై కేపీ పాల్ తన మద్దతుదారులు, క్రైస్తవ సంఘీయులకు అభివాదం చేస్తూ సువార్తీకుడు ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని, హత్య అని భావిస్తున్నామని ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొద్దిరోజులుగా అన్‌నెసెసరీగా మాట్లాడడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రవీణ్ మర ణం విషయంలో రాష్ట్రంలోని కోర్టుల్లో న్యాయం జరగపోతే అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ ఆందోళనా కార్యక్రమం వద్దకు చేరుకుని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌తో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు. పోస్టుమార్టం కార్యక్రమాలను సైతం పర్యవేక్షించారు.

ఆఖరి క్షణాలు.. ఇలా!

వీడియో కెమెరాల్లో నమోదైన సీసీ ఫుటేజ్ ప్రకారం.. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వస్తున్న పాస్టర్ ప్రవీణ్ సోమవారం రాత్రి 11 గంటల 31 నిమిషాలకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు టోల్ గేటు దాటారు. ఆ సమయంలో బుల్లెట్ హెడ్‌లైటు వెలగడం లేదు. కుడివైపు సిగ్నల్ లైటు మాత్రమే బ్లింక్ అవుతోంది. తర్వాత 11 గంటల 42 నిమిషాల 6 సెకన్లకు(11 నిమిషాలు) బుల్లెట్ నయారా పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుంది(ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం 10-11 కిలో మీటర్లు.) సరిగ్గా బంకుకు ఎదురుగా రోడ్డు పైనుంచి ఎడమవైపు గట్టు కిందకు ప్రవీణ్ బుల్లెట్‌తో సహా పడిపోయారు. బుల్లెట్ కింద పడిపోతున్న సమయంలో దాని పక్క నుంచి ఎరుపు రంగు కారు వెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. ఆ వెంటనే లారీ కూడా వెళ్లింది.



పాస్టర్ ప్రవీణ్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో భారీ బందోబస్తు మధ్య హైదరాబాద్‌కు తరలిస్తున్న పోలీసులు



మార్చురీ గదిలోకి అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేపీ పాల్



పోస్టుమార్టం కోసం ఇంక్వెస్ట్ సిద్ధం చేస్తున్న అధికారులతో మాట్లాడుతున్న హర్షకుమార్



రాజమహేంద్రవరంలో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

రంగంలోకి ఐదు బృందాలు : ఎస్పీ



పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి కేసు దర్యాప్తు వేగంగా జరుగుతోందని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక బృందాలు నిజం నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యాయని చెప్పారు. అధునాతన సాంకేతికత సహాయంతో అన్ని కోణాల్లో పరిశీలన చేస్తున్నామన్నారు. పాస్టర్ ప్రవీణ్ చివరిసారి మోహన్‌రావు అనే స్థానిక వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడారని గుర్తించినట్టు తెలిపారు. శవ పరీక్షను వీడియో తీసినట్టు చెప్పారు. ఈ ఘటనపై ఎవరి వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని కోరారు. వదంతులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘటనా స్థలంలో కర్రలపై ఉన్న రక్తపు మరకలను, దుస్తులను ఫోరెన్సిక్ నిపుణులకు పంపించామని ఆయన వెల్లడించారు.

క్రైస్తవులు 29న రాజమహేంద్రవరం తరలిరండి

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం దురదృష్టకరమని, దీనిపై భవిష్యత్ కార్యాచరణ చేపట్టి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేసేందుకు ఈనెల 29న రాజమహేంద్రవరం హోలీట్రినిటి చర్చ్ గ్రౌండ్ వద్దకు క్రైస్తవ సోదరులంతా తరలిరావాలని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు ఈనెల 29న వస్తుందని ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ చెప్పారన్నారు.

ప్రవీణ్ మరణం కలచివేసింది : షఫీ

పాస్టర్ ప్రవీణ్ మరణం తమను కలచివేసిందని అంతర్జాతీయ ముస్లిం మైనార్టీ సువార్తీకుడు షఫీ అన్నారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతంచేయాలన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలస్యంగా వెలుగులోకి ఘటన



పిఠాపురంలో మరణించిన వ్యక్తి

పిఠాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ప్రమాదానికి కారణమైన కారుతో అందులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈనెల 24న జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని స్టువర్టుపేట వద్ద గల మారుతి వైన్స్ ఎదురుగా రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. అతడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుంది. బిచ్చగాడిగా పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో అందులోని వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా కారుని, ఆ వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో కాలువలో దూకి ఆత్మహత్య

పెరవలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తూర్పుగోదావరి జిల్లా పెరవలి వద్ద కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం జరగగా బుధవారం మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖండవల్లికి చెందిన చల్లా దుర్గారావు (29)కు భార్యతో విభేదాలు ఉన్నాయి. తరచూ గొడవలు పడుతుండడంతో మనస్తాపం చెందిన దుర్గారావు మంగళవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి లాకుల వద్దకు చేరుకుని కాలువలోకి దూకేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



చల్లా దుర్గారావు మృతదేహం

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

లారీ చక్రాల కింద పడి ఇద్దరి మృతి

మహిళకు తీవ్ర గాయాలు

జె.కొత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం

జగ్గంపేట రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట రూరల్ మండలం జె.కొత్తూరు గ్రామంలో వినాయకుని గుడి వద్ద బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గోకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన బొందల నాగు(28) తన సోదరితో కలిసి బైక్ పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఆ సమయంలో జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామానికి చెందిన ఇల్లా వరహాలు(48) జగ్గంపేట వైపు వెళతున్నాడు. జె.కొత్తూరు వినాయక గుడి వద్దకు వచ్చేసరికి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వీరి మీద నుంచి దూసుకుపోయింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ కాలు పై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను జగ్గంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రఘునాథరావు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.



మరణించిన నాగు (ఫైల్‌ఫొటో)

ఫొటోషూట్‌కు వచ్చి... ప్రాణాలు విడిచి

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి



ఆలపాటి కిషోర్(ఫైల్)

ఆత్రేయపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫొటోషూట్ కోసం వచ్చిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి కిషోర్(19) పదోతరగతి చదువుకుని కూలీ పనిచేసుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం తన స్వగ్రామంలోని బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి వెళ్లి సందడి చేశాడు. అక్కడే ఉన్న తన మిత్రులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్దకు చేరుకున్నారు. కాటన్‌బ్యారేజీ, పిచ్చుకలంక గోదావరి నదీతీరంలో ఉల్లాసంగా గడిపారు. ప్రకృతి అందాలు ఇసుక తిన్నెలలో ఫొటోషూట్‌లు తీసుకున్నారు. సాయంత్రం వరకు అక్కడే స్నేహితులతో గడిపి గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరిలో స్నానం చేసిన కిషోర్ ఊబిలో కూరుకుపోయాడు. బంధుమిత్రులు సంఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కూరుకుపోయిన చోట రాత్రి కిషోర్ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ ఎస్.రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిషోర్ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కిషోర్ మృతదేహం వద్ద బంధుమిత్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు



మునసా వీరబాబు (ఫైల్)

రాజానగరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన మునసా వీరబాబు (19) బుధవారం రాజమహేంద్రవరంలో రోడ్డు కం రైలు వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రాజానగరంలోని న్యూకాలనీకి చెందిన వీరబాబు రాజమహేంద్రవరంలోని ఆటోనగర్‌లో కారు మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. రోజు మాదిరిగానే పనిలోకి వెళ్తున్నానని చెప్పిన వీరబాబు బుధవారం ఉదయం 6గంటలకు రాజానగరంలోని వెంకీ అనే మిత్రుడితో కలిసి బైక్‌పై ఇంటి వద్ద నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో వీరబాబు పనిలోకి రాలేదని మెకానిక్ షాపు నుంచి ఇంటికి ఫోన్ వచ్చింది. దీంతో ఎక్కడికి వెళ్లాడని ఆరా తీస్తే రంపచోడవం పార్టీకి వెళ్లినట్టుగా తెలుసుకున్నారు. రంపచోడవరం నుంచి తిరుగు ప్రయాణంలో కోరుకొండ లోని సమీప బంధువుల ఇంటికి బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో వెళ్లి వారితో కొద్దిసేపు మాట్లాడిన వీరబాబు కొంతసొమ్ము అడిగి తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి రాజమహేంద్రవరం చేరుకుని మేనత్త ఇంటికి వెళ్లి అక్కడి నుంచే ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడినట్టు తెలుస్తోంది. అనంతరం ఫోన్ తన స్నేహితుడికి ఇచ్చి తాను గోదావరిలో దూకేస్తున్నానని ఈ విషయం తన అన్నయ్యకు చెప్పమన్నాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహితుడు వెంకీ ఎంత వారించినా వినకుండా వీరబాబు ఒక్కసారిగా గోదావరిలో దూకేశాడు. స్నేహితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రాజానగరంలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం హుటాహుటీన బయలుదేరి వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

అన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2చోరీ కేసుల్లో నిందితుడిని పట్టుకుని 90గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. గతేడాది డిసెంబరులో కత్తిపూడిలోని ఓ ఇంటి తలుపులు పగలుగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10న జాతీయ రహదారిపై ఉన్న నమూనాలయం వద్ద బస్సులో ప్రయాణించే మహిళ మెడలో నగలు దొంగిలించిన కేసులో గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన బైసాని సందీప్‌ను కత్తిపూడి బ్రిడ్జి వద్ద బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.7.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ హరిబాబు తదితరులున్నారు.

ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల అభ్యున్నతికి కృషి



అమలాపురంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ, సొసైటీ చైర్మన్ తిరుమలరావు

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఆ సంస్థ ఎండీ, సొసైటీ చైర్మన్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.96కోట్ల బకాయిల విడుదలకు కృషి చేస్తున్నట్టు ప్రకటించారు. గతంలోనే బకాయిలు విడుదల చేయాలని అప్పటి ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వంతో బకాయిలు విడుదల కోసం చర్చించానని, త్వరలోనే విడుదల కానున్నట్టు తెలిపారు. సభ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ సొసైటీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏబీసీడీ ఫుడ్ కోర్టు భవనంలో బుధవారం సొసైటీ కార్యదర్శి టి.త్రాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్‌చైర్మన్, ఈడీ జి.నాగేంద్రప్రసాద్, ఫైనాన్స్ అండ్ ఆడిట్ ఈడీ ప్రసాద్, కార్యదర్శి టి.త్రాసు మాట్లాడారు. ప్రతీ ఆరునెలలకు ఒకసారి సమావేశం నిర్వహించడం జరుగుతుందని, తొలి సమావేశాన్ని విజయవాడలో నిర్వహిస్తామని, కోనసీమలో తొలిసారిగా రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించామన్నారు. 1952లో సొసైటీని ఏర్పాటు చేసి సంఘ సభ్యుల నుంచి డిపాజిట్లు సేకరించడంతో పాటు అవసరమైన వారికి రుణాలను అందిస్తున్నామన్నారు. తిరుమలరావు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆసియా ఖండంలోనేనంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. 46వేల మంది సభ్యులతో రూ.2500 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సంఘ సభ్యుల పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణాలను అందిస్తున్నామన్నారు. క్రెడిట్ సొసైటీ భవనం నిర్మాణం విషయంలో ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల ప్రతినిధుల మధ్య వివాదం జ రగగా కొద్దిసేపు సమావేశంలో గందరగోళం ఏర్పడింది. అనంతరం త్రాసు ఆధ్వర్యంలో పలు తీర్మానాలను ఆమోదించారు. 230 మంది డెలిగేట్స్ హాజరైన సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు, అనంతరామయ్య, వి.ప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు

వెంటిలేటర్ పైనే అంజలి

కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థిని

ఆశగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయానికి మనస్తాపం చెంది ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఎన్.అంజలి రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఊపిరి తీసుకుంటుంది. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే ఏజీఎం దీపక్ మోసం చేయడంతో అంజలి ఈనెల 23న ఆసుపత్రిలోనే మత్తు ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమె డైరీలో రాయడంతో తన ఆవేదన బయటపడింది. దీనిపై విద్యార్థి సంఘాలు, బంధువులు స్పందించి ఆందోళనకు దిగాయి. తండ్రి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీసులు స్టేషన్‌లో దీపక్‌పై కేసు నమోదు చేశారు. దీపక్ కుటుంబంతో సహ పరారీలో ఉన్నాడు. మరోపక్క ఆసుపత్రి వద్ద పరిస్థితి అనుక్షణం ఆందోళనకరంగా ఉంది. అంజలి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. 3రోజులుగా అంజలి వెంటిలేటర్‌పై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నో కలలతో ఉన్నతంగా ఉద్యోగంలో స్థిరపడి కుటుంబంతో ఆనందంగా ఉండాలని ఊహించుకుని ఫార్మ్‌డి ఫైనలియర్ చదువుతున్న అంజలి జీవితం ఊహించని మలుపుతిరిగింది. తనకు జరిగిన అన్యాయంపై తిరగబడలేని సగటు యువతిగా బాధలను తట్టుకుని, అవమానాలు దిగమింగుకుని చివరికి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం అంజలికి వైద్యులు కొన్ని పరీక్షలు నిర్వహించినట్టు, అయితే ఆమె పరిస్థితిలో ఎటువంటి మార్పులు లేవని తెలిసింది. అంజలి కోసం ఆమె తల్లిండ్రులు ఎదురుచూస్తున్నారు. ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. దీపక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో జరిగిన సంఘటనలపై విచారణ జరుగుతుంది.

పసికందు ప్రాణాలు విడిచింది!

ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

నల్లజర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో ఓ శిశువును ఎవరో ముళ్లకంచెలో పడవేయగా కుక్కలు దాడి చేసి గాయపరిచిన విషయం పాఠకులకు విధితమే. మంగళవారం ఈ విషాద ఘటన జరగగా మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం శిశువును 10గంటలకు ఏలూరు ఆసుపత్రిలో చేర్పిస్తే మధ్నాహ్నం 3 గంటల వరకు వైద్య సేవలు అందించడంలో ఆలసత్వం వహించారు. 3 గంటలకు ప్రారంభించిన వైద్య సేవలతో శిశువు అర్ధరాత్రి 12గంటల వరకు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడింది. చివరికి చికిత్స పొందుతూ మరణించింది. సకాలంలో వైద్య సేవలందించి ఉంటే శిశువు బతికే అవకాశం ఉందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృత్యువాత పడిందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువై... ఉరేసుకున్న గర్భిణి



ప్రవల్లిక (ఫైల్)

తాళ్లరేవు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు ఎక్కువై ఓ గర్భిణి ఉరివేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం గ్రామానికి చెందిన సలాది ప్రవల్లిక(21)కు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గండివారిపాలెనికి చెందిన గండి రాంబాబుతో ఏడాది క్రితం వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. గత 5 నెలులుగా అత్తింటివారితో అదనపు కట్నం కోసం గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల పెద్దలతో తగువులు జరిగాయి. మంగళవారం ప్రవల్లికపై వేధింపులు ఎక్కువ కావడంతో ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహ త్య చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నా కుమార్తెను అత్తింటి వేధింపులతో హత్యచేశారని ప్రవల్లిక తండ్రి సత్యనారాయణ ఆరోపించాడు. ఘటనపై కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

బాలబాలాజీ ఆదాయం రూ.18,90,148

మామిడికుదురు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ హుండీలను బుధవారం లెక్కించగా రూ.18,90,148 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 36 రోజులకు ఆలయ ప్రధాన హుండీలను లెక్కించగా పై ఆదాయంతో పాటు 8.200 గ్రాముల బంగారం, 13 గ్రాముల వెండి వచ్చినట్టు చెప్పారు.

పాసింజర్ ఆటోను ఢీకొన్న వ్యాన్

తొమ్మిదిమంది మహిళలకు గాయాలు

తాళ్లరేవు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం అంబేడ్కర్‌నగర్ ప్రాంతంలో ప్రయాణిస్తున్న పాసింజర్ ఆటోను బొలేరో వ్యాన్ ఢీకొనడంతో 9 మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన 9మంది మహిళలు పాసింజర్ ఆటోలో ప్రయాణమై ఉప్పలగుప్తం గ్రామంలో శుభకార్యానికి వెళ్లారు. సుంకరపాలెం అంబేడ్కర్‌నగర్ రహదారి ప్రాంతంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలేరో వ్యాన్ ఆటోను ఢీ కొనడంతో ఆటో పల్టీలు కొట్టి 9మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు యానాం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉలిక్కిపడ్డ సత్యవాడ

కె.గంగవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామం నుంచి మహిళలు ఆటోలో ఉప్పలగుప్తం వెళుతున్న సందర్భంలో తాళ్లరేవు మండలంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనతో సత్యవాడ గ్రామం ఉలిక్కిపడింది. సత్యవాడకు చెందిన గొల్లి బాల ఉప్పలగుప్తంలో తన మనుమడి చిన్నకార్యం కోసం బయలుదేరింది. సత్యవాడ నుంచి ఆటోలో తనతో పాటు 9మంది కలిసి బయలుదేరి ప్రమాదానికి గురయ్యారు. మందపాటి విజయ కుమారి తలకు బలమైన గాయమైంది. ఆమెకు కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కొందరు యానాం ఆసుపత్రి, మరికొందరు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు స్థానికులు చెప్పారు. ప్రమాదంలో ఎవరికి ప్రాణహాని కలగకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.



గాయాలపాలైన మహిళలు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆ భగవంతుడికే ఎరుక!!



• నిధులొచ్చేనా? నిర్మాణం పూర్తయ్యేనా?

• ఐదేళ్లుగా.. కొనసాగుతున్న నగరపాలక సంస్థ భవన నిర్మాణం

• మార్చినాటికి పూర్తి కావాల్సిన పనులు • నిధుల్లేక అసంపూర్తిగానే ఉన్న నిర్మాణం

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లుగా కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణ పనులు జరగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది మార్చినాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా.. ఇంకా అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. స్మార్ట్ సిటీ నిధులు వస్తే తప్ప, ఈ పనులు పూర్తికావని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే ఆ భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందనేది ఒక ఆ భగవంతుడికే ఎరుక..

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

నగరపాలక సంస్థ కొత్త భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు 2017లో కేంద్రప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. ఈ నిధులతో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టింది. అలాగే నిధుల్లో రూ.38 కోట్లను నగరపాలక సంస్థ కార్యాలయానికి కొత్త భవనం నిమిత్తం మంజూరు చేశారు. 2021 డిసెంబర్‌లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. జీ-4 విధానంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించాలని రూ.20 కోట్లతో మూడంతస్తుల వరకు పనులు చేపట్టారు. కాంట్రాక్టర్‌కు రూ.15.50 కోట్ల వరకు వివిధ దశల్లో బిల్లులు చెల్లించారు. సుమారు రూ.పది కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. కాకినాడ స్మార్ట్ సిటీకి రూ.200 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ఈ నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.190 కోట్లు, కేంద్రం నుంచి రూ.పది కోట్లు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీకి ఇచ్చిన రూ.180 కోట్లను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి, ఇతర పనులకు ఖర్చు చేసింది. నగరపాలక సంస్థ కొత్త భవనంతోపాటు వివిధ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు కూడా నిధులందక నిలిచిపోయాయి. ప్రస్తుతానికి వాటర్ ట్యాంకుల వంటి చిన్నచిన్న పనులతో కాలక్షేపం చేస్తున్నారు. సుధాకరా ఇన్‌ఫ్రా కంపెనీ ఈ పనులు చేపట్టింది.

తలో చోట..

సినిమా రోడ్డులోని నగరపాలక సంస్థ పాత భవనాన్ని తొలగించి కొత్త భవనం పనులు ప్రారంభించారు. కీలకమైన విభాగాలను నగరంలోని వివిధ భవనాల్లోకి తరలించారు. శారదాంబగుడి వద్ద శ్రీ శక్తి భవనంలో కమిషనర్, అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలు, రెవెన్యూ, సాధారణ పరిపాలన విభాగాలు నిర్వహిస్తున్నారు. వాటర్ వర్క్సులో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన కొత్త భవనంలో ఇంజనీరింగ్ విభాగం, గాంధీనగర్‌లోని బాలభవన్ వద్ద ఉన్న భవనాల్లో ఆరోగ్యం, టౌన్‌ప్లానింగ్, ఉన్నాయి. గతంలో ఒక చోట నుంచే సేవలు పొందేవారు. ప్రస్తుతం మూడు, నాలుగు చోట్లకు కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది.



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

సురక్షిత తాగునీరు అందించడం అభినందనీయం

• జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

గొల్లప్రోలురూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ కంపెనీ రూ. 10లక్షల సీఎస్ఆర్ నిధులతో 48వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఆర్వో ప్లాంటును ఆయన బుధవారం ప్రారంభించారు. ప్రజలందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు. వాటర్ ప్లాంటు ఏర్పాటుచేసిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ కంపెనీని మర్రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లి పాప, వైస్ ఎంపీపీ బత్తిన మంగ, ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ కంపెనీ డైరెక్టర్ పిండి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వాగ్వాదం

వాటర్ ప్లాంట్ ప్రారంభించిన అనంతరం టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రారంభోత్సవం వద్దకు తమను, తమ నేత పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను ఆహ్వానించకపోవడంపై టీడీపీ నేతలు, కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో రెండుపార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటచేసుకుంది. ఈ వివాదం జరుగుతుండగానే కార్యక్రమంలో మాట్లాడిన మర్రెడ్డి అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు అభినందనీయం

కొత్తపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో ఓఎన్జీసీ సంస్థ సహకారంలో 3 ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలకు స్వచ్ఛమైన తాగునీరందించే ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. యండపల్లి, కుతుకుడుమిల్లి, కొమరగిరి గ్రామాల పాఠశాలల్లో సుమారు రూ.12లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లను ఆయన బుధవారం ప్రారంభించారు. సామాజిన సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలకు స్వచ్ఛమైన తాగునీరందించే ఆర్వో ప్లాంట్లను ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. పీబీసీ డీసీ-1 చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.రామారావు, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివా స్, మత్సా అప్పాజీ, గుండ్ర జగ్గారావు, గుండ్ర కిషోర్, వేగిశెట్టి సూర్యనిఖిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చాగంటి సత్సంగం కమిటీ అధ్యక్షుడిగా సూర్యనారాయణమూర్తి



సత్సంగం కార్యవర్గ సభ్యులతో చాగంటి కోటేశ్వరరావు దంపతులు

సర్పవరంజంక్షన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చాగంటి సత్సంగం అధ్యక్షుడిగా వి.సూర్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. బుధవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకుండి లక్ష్మీస్మారక గోశాలలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చాగంటి సత్సంగం కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాగంటి సత్సంగం 2025-27 కాలానికి నూతనకార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి డీవీటీ రాజు, సభ్యులుగా ఐ.లక్ష్మీనారాయణమ్మ, ఎస్.సుగుణ, కె.హిమబిందు, బి. మాధవి, సీహెచ్ మాధవరాజు,సీహెచ్ శ్రీలక్ష్మి, ఎన్.వెంకటరాకేష్, ఎస్.సత్యనారాయణలను ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యులను చాగంటి కోటేశ్వరరావు అభినందించారు.

'సామాజిక సేవలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి'



గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రతీ బుధవారం మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమం నిర్వాహణకు పెద్దాపురం దేవీ సీ ఫుడ్స్ పరిశ్రమ రూ.1.50లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు సమాజాభివృద్ధికి తమ వంతు కృషిచేయాలన్నారు. ప్రతీ బుధవారం మాతృత్వం పేరుతో గర్భిణీ స్త్రీలకు భోజనాలు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురావు, డాక్టర్ శ్రీని వాస్, హెడ్ నర్స్ రమాదేవి, జనసేన నాయకులు సత్తిబాబు, గున్ని, వంగలపూడి సతీష్, మన పెద్దాపురం ఫేస్‌బుక్ గ్రూప్ సభ్యులు హైదర్ అలీ, సత్యప్రశాంత్, నాని, సాయి పాల్గొన్నారు.

రైతుబజార్లలో సమస్యలను పరిష్కరించాలి



జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ప్రస్తుతం ఉన్న రెండు రైతుబజార్లు తీవ్ర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని బీజేపీ సభ్యులు జిల్లా జేసీ రాహుల్‌మీనా దృష్టికి తీసుకెళ్లారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు బీజేపీ సీనియర్ నాయకుడు దువ్వూరు సుబ్రహ్మణ్యం నేతృత్వంలో బీజేపీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల క్రితం కాకినాడలో రెండు రైతు బజార్లు ఏర్పాటు చేశారన్నారు. నాడు ఏర్పాటు చేసినటువంటి షెడ్లలోనే రైతు బజార్లో నేటికీ కొనసాగుతూ ఉండడంవల్ల వర్షం వస్తే షెడ్లు లీక్ అవుతూ అటు రైతులు ఇటు విని యోగదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారన్నారు. కాకినాడ రైతుబజార్లకు బహుళ అంతస్తు భవనాలు పార్కింగ్ కోల్డ్ స్టోరేజ్ వంటి సౌకర్యాలతో నిర్మించాలన్నారు. పేర్రాజుపేట రైతుబజారుకు వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగి ఉన్నందున కేవలం రైతు బజార్ ప్రాంతంలో 16 అడుగుల రోడ్డు మాత్రమే ఉందన్నారు. ఈ16అడుగుల రోడ్డుమీద రైతు బజారుకు వచ్చే వినియోగదా రులు వాహనాలు పార్కింగ్ చేయడంతో నడిచేందుకు కానీ ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు కానీ మార్గం లేకుండాపోతుందన్నారు. కొన్ని సందర్భాలలో ఇతర వాహనాలు పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొనడంతో వాహనాలు ధ్వంసం అవుతున్నాయన్నారు. స్థానిక గాంధీ నగర్ రైతుబజార్ సమీపంలో సుమారు 50సంవత్సరాల క్రితం ఒక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగిందన్నారు. ఈకాంప్లెక్స్ దాదాపు శిథిలావస్థలో ఉండ టంతో కాకినాడ జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీర్లు ఈభవనాన్ని కూల్చివేయాలని 2022లోనే నివేదిక ఇచ్చినప్పటికీ ఈభవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏడిద కృష్ణ, 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సత్యవతి, వెంకటరమణచ వెంకట్, శివగణేష్ పాల్గొన్నారు.

షేర్‌ధనంపై వడ్డీ ఇవ్వాలని రైతుల డిమాండ్



సొసైటీ మహాజనసభలో సూచనలిస్తున్న పర్సన్ ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్

కరప, మార్చి26(ఆంధ్రజ్యోతి): సంఘ సభ్యు ల నుంచి షేర్‌ధనం కింద వసూలుచేస్తున్న సొమ్ముపై వడ్డీ చెల్లించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. కరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో బుధవారం మహాజనసభ జరిగింది.ఈ మహాజనసభకు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, పర్సన్ ఇన్‌చార్జ్ ఎన్‌వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ విచ్చేసి సంఘం ద్వారా సభ్యులకు అందిస్తున్న సేవలను వివరించారు. సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో రాయుడు వెంకటేశ్వరరావు(చిట్టియ్య) 2024-25 ఆర్థికసంవత్సరానికి సంఘం ద్వారా చేసిన జమాఖర్చులను, రుణాలు, లాభాలను సభ్యులకు తెలిపారు. అలాగే 2025-26 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఇటీవలె ఆత్మహత్య చేసుకున్న సీఈవో రైతులు చెల్లించిన రుణాలు, వడ్డీల సొమ్ము రూ.13.60లక్షల మేర దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యుల నుంచి ఆ సొమ్ములను రికవరీ చేస్తామని పర్సన్ ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్ స్పష్టంచేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన సంఘ భవనం పైఅంతస్తును పూర్తిచేయాలని, వాయిదా మీరి న అప్పులను వసూలు చేయాలని, సంఘానికి శాశ్వత సీఈవో, సిబ్బందిని నియమించాలన్న సభ్యుల కోరికపై తీర్మానం చేసినట్టు ఆయన తెలిపారు. కరప డీసీసీబీ బ్రాంచ్ సూపర్‌వైజర్ డి.శ్రీదత్తేశ్వరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావు, విశ్రాంత సీఈవో చోడపునీటి వెంకటరమణ, సభ్యులు, సిబ్బంది తమాదేవి, మధు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో టీడీపీకి అధికారం

• పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. తెలుగుదేశంపార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం వర్మ ఆధ్వర్యంలో కార్యకర్తే అధినేత సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు నుంచి వచ్చిన కార్యకర్తలు నుంచి 100కిపైగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసీపీ హయాంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులు ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తల ఇబ్బందులు తెలుసుకుని పరిష్కరించే అవకాశం కల్పించారని చెప్పారు. వైసీపీ హయాంలో తనతో పాటు కార్యకర్తలు, నాయకులపై పెట్టిన అక్రమ కేసులన్నింటిని ఎత్తివేయాలని కోరారు.

వినతుల వెల్లువ

కార్యకర్తలు నుంచి పలు సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. 2019-24 కాలంలో అర్హులైనా ఇళ్లస్థలాలు రానివారికి న్యాయం చేయాలని, టీడీపీ హయాంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కార్యకర్తలు కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అధికారు లువద్ద ఇంకా అనేక అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇంకా వైసీపీ వారి హవాయే కొనసాగుతున్నదని, దీనిని సరిచేయాలని కోరా రు. కార్యకర్తలు నుంచి వినతులను అన్నింటి ని ఆయాశాఖల అధికారులకు, పార్టీ నా యకత్వానికి పంపుతామని వర్మ తెలిపారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉం టానని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖ సీఎం సహాయనిధి

• కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖ సీఎం సహాయనిధి అని, ఆపత్కాలంలో పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంవద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కొండబాబు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 8మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 15వేలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అరదాడి శివ, పీర్ల లక్ష్మీప్రసన్న, గురుసు దర్గారావు, సంగాని నాగూర్, పిన్నంరెడ్డి బుజ్జి, పట్టా శేఖర్, తిప్పాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపై నల్లతామర పురుగు ఉధృతి

గొల్లప్రోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మామిడితోటల్లో నల్లతామరపురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామని రామచంద్రపురం ఉద్యానవన శాస్త్రవేత్త సీహెచ్. చిన్నబ్బాయి తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని మామిడితోటలను ఉద్యానవనశాఖాధికారి కె.సత్యశైలజతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. పురుగు ఉధృతి వలన పిందెలు రాలిపోయి మామిడికాయల దిగుబడి తగ్గుతుందని చెప్పారు. తామర పురుగు నియంత్రణకుగానూ పిప్రోనిల్ 2మి.లీలు లేదా సైఎన్‌శాడ్ 0.3మి.లీలు లేదా థయోమిథాక్సమ్ 0.3 గ్రాములు లేదా సయాంట్రనిలిప్రోల్ 1.8మి.లీలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి మల్లిఖార్జునరావు

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మామిడి సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్.మల్లిఖారుజనరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చినబ్రహ్మదేశం గ్రామంలో మామిడి సాగులో సస్య రక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మామిడి తొందరగా కాపు కు రావడం, నాణ్యమైన ఉత్పత్తి, అధిక దిగుబడి రావాలంటే మొక్కలు నాటినప్పటి నుంచి వాటికి అందించే సమగ్ర సస్యరక్షణ చర్యలపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ చిన్నబ్బాయి, మండల ఉద్యాన శాఖాధికారిణి నూనె సుజాత, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నవోదయకు పలువురు విద్యార్థుల ఎంపిక

కరప, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నవోదయ ప్రవేశపరీక్షలో కరపమండలానికి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పెదకొత్తూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన జల్లి ప్రవీణ్‌సంతోష్, వేళంగి భానుప్రకాష్ స్కూల్‌కు చెందిన గుత్తుల ప్రజ్ఞ, బచ్చల జీవన్, ఎయిమ్ కిడ్స్ స్కూ ల్‌కు చెందిన వాసంశెట్టి అక్షయసత్యఈశ్వరిదేవిలు నవోదయ ఎంట్రన్స్ లో సత్తా చాటి ఆరోతరగతిలో చేరేందుకు అర్హత సాధించారు. ఈ విద్యార్థులను ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు చింతా నాగలక్ష్మి బుజ్జి, సవిలే నీలిమరాజేష్, సీఆర్‌పీ పలక రాజు అభినందించారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలని పెద్దాపురం మోటారు వాహన తనిఖీ అధికారి కె.ప్రసాద్ సూచించారు. బుధవారం పెద్దాపురం మోటారు వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం, కిర్లంపూడి పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోటారు వాహన తనిఖీ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ బస్సులు, వ్యాన్‌లు డ్రైవర్లు విద్యార్థులను పాఠశాలలకు చేర్చే సమయంలో తిరిగి ఇళ్లకు తీసుకువెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ, అజాగ్రత్తగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. యాజమాన్యాలు బస్సులు, వ్యాన్‌లు ఇతర వాహనాలకు అన్ని రకాల సర్టిఫికెట్లు కలిగి ఉండాలని డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్సు కలిగి అనుభవజ్ఞుడై ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పాఠశాలల యాజమాన్యంతో మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

ఏడేళ్ల నాటి సమస్యకు మోక్షం

• భావనారాయణస్వామి ప్రహరీగోడ నిర్మాణం

• హర్షం వ్యక్తం చేసిన భక్తులు

సర్పవరంజంక్షన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయం దక్షిణ దిక్కులో ఏడేళ్ల కిందట కూలిపోయిన ప్రహరీ గోడ నిర్మాణం ఎట్టకేలకు దేవదాయశాఖ అధికారులు పూర్తి చేశారు. పురావస్తుశాఖ అధికారుల అనుమతితో ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తిచేశారు. కాకినాడరూరల్ మండలం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయం ఉంది. 108 వైష్ణవ దేవాలయాల్లో ఒకటిగా భక్తులు కాకినాడరూరల్ సర్పవరంలో వేంచేసియుంది. అత్యంత పురాతన చరిత్ర కలిగిన సుప్రసిద్ధ భావనారాయణస్వామి ఆలయం దక్షిణానున్న ఆలయ ప్రహరీగోడ కొంతభాగం కూలిపోయింది, తక్షణమే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, లేదంటే ఆ ప్రభావం మిగతా ప్రహరీ భాగంపై పడుతుందని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పురావస్తుశాఖ అధికారులకు లేఖలు రాశాం. అనుమతులు లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేదని ప్రజాప్రతినిధులు పేర్కొనేవారని వాపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భక్తుల ఆకాంక్షల మేరకు స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, గ్రామ పెద్ద పుల్ల శ్రీరాముల చొరవతో పురావస్తుశాఖ అధికారులకు ప్రపోజల్స్ పంపించారు. భక్తులు మనోభావాలు దెబ్బదినకుండా, పురాతన ప్రాచీన ఆలయాల ప్రాసస్త్యం దెబ్బతినకుండా ప్రహరీ నిర్మిస్తామని ఆలయ ఈవో లక్ష్మీనారాయణ ప్రతిపాదనలు పంపించి, పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, సిబ్బంది సమక్షంలో ప్రహరీ నిర్మాణం చేపట్టడం జరిగిందని ఈవో తెలిపారు.



నూతనంగా ఎన్నికైన ఫ్యాప్టో కార్యవర్గం

ఫ్యాప్టో కార్యవర్గం ఎన్నిక

కాకినాడరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్టీయూ భవన్‌లో జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ ఎన్నికల నిమిత్తం సభ్య సంఘాలతో బుధవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఉద్యమ ఆవశ్యకత, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి కాకినాడజిల్లా ఫ్యాప్టో కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎస్టీయూ నుంచి కె.కాశీవిశ్వనాథ్‌ను, జనరల్ సెక్రటరీగా యూటీఎఫ్ నుంచి సీహెచ్ సూరిబాబు, కోశాధికారిగా బీటీఏ నుంచి బి.శరత్, కో చైర్మన్లుగా ప్రధానోపాధ్యాయుల సంఘం నుంచి కూర్మారావు, ఏపీటీఎఫ్ నుంచి టి.వెంకట్రావు, శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియ ప్రధానోపాధ్యాయుల సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి ఆధ్వర్యంలో నిర్వహించగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ పర్యవేక్షించారు.

జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమం

సామర్లకోట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వ్యాధి నివారణ టీకా కార్యక్రమంలో భాగంగా ఈనెలాఖరు వరకూ పశువులలో గాలికుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నందున పశుపెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట ప్రభుత్వ పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ ప్రమీల తెలిపారు. ఈమేరకు విలేకరులతో డాక్టర్ ప్రమీల మాట్లాడుతూ 4 నెలల పైబడిన ఆవులు, గేదెలకు గాలికుంటువ్యాధి టీకాలు వేస్తామన్నారు. రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 4 నుంచి 8 నెలల వయస్సుగల ఆవు, గేదె దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించుకోవాలని వెటర్నరీ ఏడీ డాక్టర్ ప్రమీల తెలిపారు.

'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి'

కరప, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశమందిరంలో బుధవారం ఏపీ సీ.ఎన్.ఎఫ్ క్యాడర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఆరోగ్యవంతమైన పంటలను దేశానికి అందించేలా రైతులు కృషిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏవో అప్పసాని వెంకటరాజేష్, ఐకేపీ ఏపీఎం ఎం.ఎస్.బాలాదేవి, ఎం.టి.లు ధనలక్ష్మి, సన్యాసినాయుడు, వీవోఏలు ప్రశాంత్‌కుమార్, శ్రీరాములు, సీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్ జామియా మసీదులో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు ఇజాజుద్దీన్, మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు ఎస్‌కె రహీమ్, జిల్లా మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎంఏ తాజుద్దీన్, ఎండీ అన్సర్, ఎంఏ సయ్యద్, ముర్తాజా, ఆలీషా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ కాలేజీలో ప్రాంగణ ఎంపిక

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివిలి కిట్స్ ఫార్మసీ కాలేజీలో విద్యార్థులకు మెడిటెక్ బెంగుళూరు కంపెనీ బృందం ఇంటర్వ్యూలు బుధవారం నిర్వహించారు. 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను చైర్మన్ అభినందించారు. రాబోయే రోజుల్లో జరిగే ప్రాంగణ ఎంపికలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని చైర్మన్ పేర్కొన్నారు.

నేడు ఎక్సైజు స్టేషన్‌లో వాహనాల వేలం

పిఠాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఎక్సైజుస్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన రెండు ఆటోలు, ఎనిమిది ద్విచక్ర వాహనాలను గురువారం ఉదయం 11గంటలకు స్టేషన్ వద్ద వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు సూపరింటెండెంట్ సమక్షంలో ఈ వేలం జరుగుతుందని చెప్పారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావత్తు సొమ్ము రూ.2వేలు చెల్లించాలని, ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన తెలిపారు.

ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై హర్షం

పిఠాపురం, మార్చి26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన రూ.11వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించడంపై డెమోక్రటిక్ పీఆర్‌టీయూ కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షుడు దువ్వా మణికుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల బకాయిలతో పాటు ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ లోన్లు బకాయిలు రూ6,200 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఉగాదికి డీఏ ప్రకటించాలని, పీఆర్‌సీకి కమిషన్ ఏర్పాటు చేయాలని, సరెండర్ లీవ్ అమౌంట్‌ను జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గొల్లప్రోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని కొత్తపేట రామాలయం వద్ద గురువారం గొల్లప్రోలు టీమ్ రామచరణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం కార్తీకేయ ఆసుపత్రి వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేస్తారని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

కరప, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కరపమండలపరిషత్ కార్యాలయంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామపంచాయతీల్లో చలివేంద్రాలను ఏర్పాటుచేసినట్టు ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఏవో నరసింహం తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

రౌతులపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని రౌతులపూడి మండల పాస్టర్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సామ్యూల్ డిమాండ్ చేశారు. ప్రవీణ్‌ది యాక్సిడేంట్ కాదని, హత్యగా క్రైస్తవ సంఘాలకు అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్రైస్తవులు యాదగిరి జ్యోతిబాబు, ఎం.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

సంపూర్ణ సేంద్రియ వ్యవసాయ జిల్లాగా 'అల్లూరి'

• రూ.13,946 కోట్ల మేర స్థూల విలువ జోడింపు చర్యలకు ప్రణాళిక
• ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ దినేష్ కుమార్ కార్యాచరణ నివేదిక

రంపచోడవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపూర్ణ సేంద్రియ వ్యవసాయ జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లాను తీర్చిదిద్ది, 2030 నాటికి రాష్ట్ర జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)లో అల్లూరి జిల్లా కీలక భాగస్వామిగా నిలవనున్నదని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. రెండు రోజుల కలెక్టర్ల సదస్సులో అల్లూరి జిల్లా అభివృద్ధి ప్రణాళికా నివేదికను అల్లూరి కలెక్టర్ బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. రూ.13,946కోట్ల మేర స్థూల జిల్లా విలువ లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా సహజ వనరులతో 22గిరిజన మండలాలు అలరారుతుండగా, గిరిజనులు సహజంగానే సేంద్రియ వ్యవసాయ పద్ధతులనే అనుసరిస్తుండటంతో, వారికి ప్రోత్సాహక రంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం వంటి తదితర అంశాలతో ప్రణాళికను రూపొందించి అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 1,61,962 ఎకరాల్లో 94,270 మంది రైతాంగం ప్రకృతి వ్యవసాయాన్నే అనుసరిస్తున్నారు. రూ.396కోట్లతో మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకాన్ని చేపట్టనున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్న సహజ వనరులను, ప్రకృతి అందాలను పర్యాటకులకు మరింత చేరువ చేసి, పర్యాటక రంగాన్ని ప్రధాన ఆదాయ వనరుగా తీర్చి దిద్దేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం ముఖ్యంగా ఇక్కడున్న చట్టాలను, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని గిరిజన పర్యాటక మండలిని ఏర్పాటు చేసి, టూరిజం కార్పొరేషన్ మాదిరిగానే పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. అంతే కాకుండా అన్ని రంగాల్లో రూ.950 కోట్లతో 15 శాతం వృద్ధి లక్ష్యాన్ని ఈఆర్థిక సంవత్సరంలో సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

సమస్యల పరిష్కారంపై ఐటీడీఏ ముట్టడి



చింతూరు సెంటరు నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీగా వస్తున్న ప్రజలు

చింతూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో బుధవారం చింతూరు ఐటీడీఏను సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు ముట్టడించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తునికాకు సేకరణ చేపట్టాలన్నారు. వలస ఆదివాసీలు సాగు చేసు కుంటున్న భూములకు పట్టాలు ఇవ్వా లన్నారు. ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తొలుత చింతూరు సెంటరు నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, వీఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, మల్లం సుబ్బమ్మ, పొడియం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలని ఐటీడీఏ ఎదుట ధర్నా

చింతూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా పొదుపు సంఘంలో తమకు అన్యాయం జరిగిందని తల్లీ కూతుళ్లు వేంపాటి పద్మ, పావని బుధవారం చింతూరు ఐటీడీఏ ముందు ధర్నా చేశారు. ఈసందర్భంగా వేంపాటి పద్మ మాట్లాడుతూ వరరామ చంద్రపురం మండలం రేఖపల్లికి చెందిన తాను డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలిగా ఉన్నానన్నారు. తనకు తెలియకుండా, ఎటువంటి తీర్మానం లేకుండానే పొదుపు ఖాతా నుంచి సొమ్ములు మిగిలిన సభ్యులు డ్రా చేశారని ఆరోపించారు. ఈవిషయమై తాను పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని ఆమె కోరారు. అనంతరం ఐటీడీఏలో ఆమె వినతి పత్రాన్ని అందజేశారు.

ఇకపై ప్రతి బుధవారం ప్రజాదర్బార్


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం క్యాంపు కార్యాలయంలో ప్రతీ బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి 41అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారుల వద్దకు తీసుకువెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. ఎటపాక మండలం లక్ష్మీపురానికి రోడ్డు నిర్మించాలని, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలని, పట్టుచీర గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మించాలని, దబ్బవలసలో రేషన్ డిపోను ఏర్పాటు చేయాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ నాయకులు పి.అనంతమోహన్, ఎ.బాపిరాజు, వై.నిరంజనీదేవి, పుట్టి రమేష్, బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

అడ్డతీగల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అడ్డతీగల, వై.రామవరం మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్.లక్ష్మి తెలిపారు. అడ్డతీగల మండలంలో అడ్డతీగల-2లో అంగన్‌వాడీ ఆయా, వై.రామవరం మండలం చాకిరేవుల, నువ్వుగంటి పాలెం సెంటర్లకు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్టీ అభ్యర్థులు స్థానికత ధ్రువపత్రంతో పాటు పదో తరగతి ఉత్తీర్ణత, 2025 జూలై ఒకటో తేదీ నాటికి 21 ఏళ్ల నిండి 35ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఆధార్, రేషన్ కార్డు తదితర పత్రాల నకళ్లతో ఫొటోను జతపర్చి స్థానిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కోసం తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఏప్రిల్ 10న దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీగా సూచించారు.

రంపచోడవరంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

దేవీపట్నం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్‌ను రంపచోడవరంలో ఏర్పాటు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో 11మండలాల ఆదివాసీ ప్రజలు వారి ప్రాంతంలో ఉన్న సమస్యలు చెప్పుకోవడానికి రంపచోడవరంలో ఉన్న ఐటీడీఏ పీవో కార్యాలయానికి, సబ్ కలెక్టర్ కార్యాలయానికి, ఏరియా ఆసుపత్రికి వస్తారన్నారు. వారి సౌకర్యార్థం రంపచోడవరంలో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేస్తే వారితో పాటు సామాన్య ప్రజలు, టూరిస్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరి విద్యార్థుల ఎంపిక

మోతుగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం నుంచి ఇద్దరు విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. మోతుగూడెంలో ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాల విద్యార్థులు బొలిశెట్టి వరుణ్, ఉంగుటూరు రిశ్వంత్ నవోదయలో ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఎంపియ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం మల్లెల రఘురాం తెలిపారు. ఆ ఇద్దరి విద్యార్థులకు ఏపీ జెన్‌కో పవర్ ప్లాంట్ ఏఈ నరసింహ సతీమణి మంజూ భార్గవి ఏడాదిగా ప్లే బ్యాక్ సొసైటీలో భాగంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మోతుగూడెం ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాల ఎల్ఎంసీ చైర్మన్, చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకష్ణ, డీఈటీ వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సర్పంచ్ ఆకేటి, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, మోతుగూడెం ఎస్ఐ శివన్నారాయణ, మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


ఉంగుటూరి రిశ్వంత్, బొలిశెట్టి వరుణ్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

భూసార పరీక్షలపై అవగాహన

జగ్గంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జగ్గంపేటలోని రైతు భరోసా కేంద్రం-2లో భూసార పరీక్ష ఫలితాలు, ఎరువుల వినియోగంపై మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ హరి, డీఆర్సీఏవో సంజీవ్ కుమార్, భూసార పరీక్ష కేంద్రం ఏవో పవిత్ర.. రైతులకు శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్షల అనంతరం ఫలితాలను ఆధారంగా చేసుకుని రైతులు తమ పొలంలో ఎంతెంత మోతాదులో ఎరువులు వేయాలో రైతులకు వివరించారు. రైతులు, వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.జగ్గంపేట కూడలి పోలీస్‌స్టేషన్ పక్కన సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజుతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడు తూ, ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. హైవేపై వాహనాలు నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


జగ్గంపేటలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

నీరుగారుతోన్న ప్రభుత్వ లక్ష్యం

● చిత్తశుద్ధిలేని సమావేశాలు..
శాఖల మధ్య సమన్వయ లోపం

శంఖవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అధికారులకు చిత్తశుద్ధి లేని కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. కీలక సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులకు సమాచారం లేనికారణంగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన సమాచారం వెళ్లడంలేదు. ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ కార్యక్రమం ఇందుకు నిదర్శనంగా ఉంది. వ్యవసాయ అనుబంధ శాఖలు, ఉపాధి, డీఆర్‌డీఏ, ఆర్‌జీఎస్ శాఖలు సమన్వయంతో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై వివరించాలి. పంటల పరిస్థితి, మిద్దె పంటల పెంపకం వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించాలి. దీనిపై జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎలిజియర్ సమావేశానికి వచ్చారు. వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఏ శాఖకు పూర్తిస్థాయి సమాచారం లేదు. పూర్తిస్థాయిలో అధికారులు హాజరు లేకుండానే సమావేశం మమ అనిపించారు. ఇటువంటి కార్యకాల వల్ల క్షేత్రస్థాయికి ప్రభుత్వ లక్ష్యం చేరకుండా పోతుంది. వ్యవసాయశాఖ నిర్లక్ష్యానికి ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.



ఫొటో కోసం మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

తూతూమంత్రంగా అక్రమ క్వారీల పరిశీలన

రౌతులపూడి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మూలగపూడి సర్వే నెంబర్-1లో అక్రమ క్వారీలను తహశీల్దార్ ఎస్వీ నరేష్ తూతూ మంత్రంగా పరిశీలించారు. బండ రాళ్లకు గిరాకీ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సర్వే నెంబర్-1లోని క్వారీలను తహశీల్దార్ పరిశీలించారు. అయితే ఎన్ని అనుమతి లేని క్వారీలు ఎన్ని ఉన్నాయో తేల్చలేదు. కాగా పూర్తిగా విచారణ చేసి అక్రమ క్వారీలు గుర్తిస్తామని తహశీల్దార్ తెలిపారు. క్వారీలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని వీఆర్వోకు ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. అయితే ముందుగానే సమాచారం వెళ్లడంతో అక్రమ క్వారీల్లో లారీలను, మిషన్లు తీసివేసారు. బండరాళ్ల తరలింపును నిలిపివేశారు.

మాజీ మంత్రి పరామర్శ

జగ్గంపేట, మార్చి26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో మరణించిన సింగిరెడ్డి రాంబాబు కుటుంబ సభ్యులను వైసీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం, తోట రాంజీ, నాయకులు, పరామర్శించారు. కార్యక్రమంలో వీర్రాజు, కరుటూరి గఫూర్, కాపవరపు వరప్రసాద్, పెద్దాడ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీ పరిశీలన

కిర్లంపూడి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెద్దనాపల్లి గ్రామంలో వర్షాలు, వరదలు వస్తున్న సమయంలో బీసీ కాలనీ అంతా ముంపుకు గురవుతుంది. దీంతో ఈ ప్రాంతాలను బుధవారం కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలించారు. పంచాయతీ రాజ్‌శాఖ డీఈతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి హైస్కూల్ రోడ్డు నుంచి బీసీ కాలనీలో మురికినీరు పారేందుకు చివరి వరకు రోడ్డుతో పాటు డ్రైనేజీలు నిర్మించేందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈ ఉమాశంకర్‌ను ఆదేశించారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, వెంకటశివ, తూము కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ప్రకృతి వ్యవసాయంలో ప్రణాళికలు

కోటనందూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు ప్రకృతి వ్యవసాయంలో ప్రణాళికలు తయారుచేస్తున్నామని ఏవో ఎ.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వెలుగు సిబ్బందికి సమావేశం జరిగింది. మాస్టర్ ట్రైనర్ అడిగర్ల రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో అదనంగా మరో నాలుగు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు సిద్ధం చేశామన్నారు. మండలంలో ఈ ఏడు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం పూర్తిస్థాయిలో చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ పీవీ సత్యనారాయణ, ఏపీఎం సూర్యకుమారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

గండేపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలని పెద్దాపురం మోటారు వాహన తనిఖీ అధికారి కె.ప్రసాద్ సూచించారు. బుధవారం పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం, కిర్లంపూడి పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన ఈ సమావేశంలో మోటారు వాహన తనిఖీ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ స్కూల్‌బస్సులు, వ్యాన్‌లు డ్రైవర్లు విద్యార్థులను పాఠశాలలకు చేర్చే సమయంలో, తిరిగి ఇళ్లకు తీసుకువెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ, అజాగ్రత్తగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. యాజమాన్యాలు బస్సులు, వ్యాన్‌లు ఇతర వాహనాలకు అన్ని రకాల సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్సు కలిగి అనుభవజ్ఞుడై ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.


పాఠశాలల యాజమాన్యంతో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

నవోదయకు విద్యార్థుల ఎంపిక

ప్రత్తిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాలల్లో ప్రవేశానికి ప్రత్తిపాడు మండలం నుంచి 20మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వెంకటనగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన శర్పం రాజరాజేశ్వరి, కొత్తమూరి పేట జీపీఎస్ పాఠశాలకు చెందిన విజయదుర్గ, సంధ్యారాణి నవోదయకు ఎంపికయ్యారు. దీంతో ప్రభుత్వ పాఠశాల నుంచి ఎంపికైన ఇద్దరినీ ఎంఈవో వి.రాజబాబు, హెచ్‌ఎంలు సతీష్, వెంకట్రాజులు, యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు కోడి శ్రీనివాస్, డి.రాజబాబు అభినందించారు. అలాగే ఒమ్మంగి భారతి విద్యానికేతన్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులను నవోదయకు ఎంపిక కావడంతో వారిని కరస్పాండెంట్ సుంకర వీరబాబు అభినందించారు. అలాగే ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన 16 మంది విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను సంస్థ అధినేత రామిశెట్టి వీర్రాజు అభినందించారు.

తుని రూరల్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ముత్యాల విశ్రుత్, మేడిశెట్టి హనీష్, చంచర్ల వెంకట చంద్రమౌళి, దూలపల్లి విఖ్యాత్, నవోదయకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, తల్లిదండ్రులు అభినందించారు.

సత్యదేవుడి సన్నిధిలో భజన కార్యక్రమాలు


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య 522 వర్ధంతి సందర్భంగా బుధవారం సత్యదేవుడి సన్నిధిలో అన్నమయ్య కళాక్షేత్ర సమన్వయకార్యకర్త సానా నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో భజనలు, అన్నమాచార్య కీర్తనలు ఆలపించగా భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం సభ్యులు ఈవో సుబ్బారావును కలిసి తిరుమల మాదిరి 364 రోజులు రత్నగిరిపై అఖండ హరినామసంకీర్తనలు నిర్వహించాలని కోరారు. శ్రీవిజాన భారతీ పీఠాధిపతి యడ్ల ప్రభాకరరావు, పైలా అప్పలనాయుడు, దాసరి సూర్యనారాయణ పాల్గొన్నారు.అలాగే దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఒకదాత రూ.లక్ష విరాళం సమర్పించారు. విశాఖపట్నంకు చెందిన బేతా శివ, పార్వతి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు ఇచ్చారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ప్రత్తిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాలెంలో నిరుపేద కుటుంబానికి చెందిన పిల్లి సతీష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బుధవారం ఆ కుటుంబాన్ని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మురళీరాజు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అలాగే ఒమ్మంగిలో అస్వస్థతకు గురైన డి.నూకరాజుకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో చందక నాని, తుట్ట నాగభూషణం, తుట్ట గోవిందు, కోలా తాతబాబు, డి.హరిరాజు, కోల బాబ్జి, యాళ్ల ఏసు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కూనవరంలో పోలవరం గ్రామసభ

కూనవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కూనవరంలో పోలవరం స్ట్రక్చర్ వాల్యూ సంబంధించిన పోలవరం గ్రామసభ గురువారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కూనవరం పంచాయతీలోని కూనవరం, టేకులబోరు గ్రామాలకు చెందిన అవార్డు వాల్యేషన్ నోటీసు తీసుకున్న వారు మాత్రమే రావాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో సభ జరుగుతుందన్నారు. నోటీసు వచ్చిన వ్యక్తి సంబంధిత రెండు పాస్‌ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఓటరు ఐడీ రెండు కాపీలు, ఇంటి పన్ను ఒరిజినల్ 2023-24, 2024-25 సంబంధించనవి, కరెంటు బిల్లు ఒరిజనల్ రెండుతో పాటు అవార్డు నోటీసు తీసుకురావాలన్నారు.

దరఖాస్తు చేసుకున్న నిర్వాసితుల సమస్య 48 గంటల్లో పరిష్కారం

కూనవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న పోలవరం నిర్వాసితుల సమస్యను 48గంటల్లో పరిష్కరిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. మండలంలో పోలవరం ఆర్అండ్ఆర్ గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. కొండ్రాజుపేటలో జరిగిన సమావేశంలో అనర్హుల జాబితాలో వచ్చిన కొంత మంది నిర్వాసితులతో మాట్లాడారు. తాము ఇక్కడే నివశిస్తున్నా అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ కొంతమంది నిర్వాసితులు పీవో దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ అన్యాయం జరగదని, అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే 48గంటల్లో సమస్యను పరిష్కరిస్తామని పీవో తెలిపారు. అనంతరం అధికారులు పోలవరం గ్రామసభ నిర్వహించారు. గిరిజనులకు ఆర్అండ్ఆర్ రూ.6.86లక్షలు ఇస్తామని, ఇతరులకు రూ.6.36లక్షలు ఇస్తామన్నారు. అదేవిధంగా రెగ్యులర్ గిరిజన ఉద్యోగులకు రూ.1.86లక్షలు, ఇతర రెగ్యులర్ ఉద్యోగులకు రూ.1.36లక్షలు ఇస్తామన్నారు. అదేవిధంగా భూమి ఉన్న గిరిజనులకు రెండున్నర ఎకరాలకు భూమికి భూమి ఇస్తా మన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎస్‌డీసీలు లక్ష్మీపతి, చంద్రశేఖర్, చింతూరు తహశీల్దార్ చిరంజీవి, ఆర్అండ్ఆర్ అధికారి తమ్మిరాజు, స్థానిక నాయకులు గుజ్జా మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరంలో భారీ వర్షం

వై.రామవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, గాలులతో గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్ర ఎండల నేపథ్యంలో వర్షం కురవడంతో మండల ప్రజలు సేద తీరారు.

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

ఎటపాక, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కరించుకుని ఎటపాక మండలం గన్నవరం, గౌరిదేవిపేట గ్రామాల మధ్యలో కొలువై ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో గురువారం నుంచి రెండో రోజులు జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుదీపాలు, రంగులతో తీర్చిదిద్దారు. తొలి రోజు గురువారం హోమం, సాయంత్రం బలి పూజ కార్యక్రమం, శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతర నిర్వహణ, ఏర్పాట్లకు అయ్యే ఖర్చు రూ.8లక్షలు గౌరిదేవిపేట వాసి దొంతు హరిప్రసాద్ సమకూర్చారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

రంపచోడవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 'కార్యకర్తే అధినేత' కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా శ్రీను ఎన్నిక

రాజవొమ్మంగి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తరపున అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఏర్పాటుచేసిన సమావేశంలో రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ నుంచి ఇద్దర్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. అల్లూరి సీతారామ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా ఈఠ శ్రీనుబాబును, ప్రింట్ మీడియా ఉప కార్యదర్శిగా వీర్రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామాల్లో శరవేగంగా సీసీ రోడ్డు పనులు


లింగంపర్తిలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ బుజ్జి, తదితరులు

ఏలేశ్వరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. బుధవారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎస్‌జీవి సుబ్బరాజు, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ప్రాజెక్టు ఎక్స్‌పో

గండేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ప్రాజెక్టు ఎక్స్‌పో-2025 నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా యూనివర్శిటీ డిప్యూటీ ప్రో వైస్ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, సృజనాత్మక పరిష్కారాలను ప్రతిపాదించడానికి ప్రాజెక్టు ఎక్స్‌పో ఉపయోగపడుతుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను సందర్శించారు.

'ప్రగతి'లో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీలో ఎడ్జ్ ఏఐ, ఐవోటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) ఇంటెలిజెన్స్ అంశంపై మూడురోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసినట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. ఈసీఈ విద్యార్థుల అసోసియేషన్, బ్రెయినో విజన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఎడ్జ్ టు క్లౌడ్ ఇంటిగ్రేషన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ప్రోటోకాల్‌లు, వెబ్ సాకెట్లు, నిజ సమయంలో ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పరిశ్రమల్లో వినియోగ ఉదాహరణలు, ఎడ్జ్ ఏఐ కోసం భద్రతా పద్ధతులను వివరించారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేతలకు నివాళి


చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

ప్రత్తిపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ నేతలు కామ్రేడ్ అప్పారి వెంకటస్వామి, కామ్రేడ్ వత్సవాయి సూర్యనారాయణ రాజు వర్ధంతిని స్థానిక మండల వనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు కోడి శ్రీను, దొడ్డిపట్ల రాజబాబు.. వెంకటస్వామి, సూర్యనారాయణ రాజుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వారిద్దరు చేసిన సేవలను గుర్తించుకుని వారి బాటల్లో నడుచుకుంటూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేసే విధంగా భవిష్యత్ కార్యాచరణ చేపడతామన్నారు. వీవీ రమణ, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్.రామలింగేశ్వరడు, కార్యకర్తలు ప్రసాద్‌బాబు, గణేష్,రాము, సాయి ప్రసాద్, రవితేజ పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

తుని రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా కొండ తొలగించేందుకు అధికారులు వినియోగిస్తున్న బాంబు బ్లాస్టింగ్లతో స్వల్పంగా దెబ్బతిన్న ఇళ్లను పోలవరం క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ తిరుమలరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కంట్రోల్ బ్లాస్టింగ్‌కు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు ప్రభుత్వం చేయదని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. అనంతరం పోలవరం అక్విడెట్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఈ.గోవిందరావు, డి. మురళి, ఇరిగేషన్ జేఈ ఉన్నారు.

ఇద్దరికి స్వల్ప గాయాలు

జగ్గంపేట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రామవరం భారత్ పెట్రోల్‌బంకు ఎదురుగా హైవేపై ట్రాలీని ఢీకొన్న ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్తున్న ట్రాలీ ముందు వెళుతున్న ఆటో సడన్‌బ్రేక్ వేయడంతో ట్రాలీ కూడా బ్రేక్ వేశారు. దీంతో వెనుక వస్తున్న ఐషర్‌వ్యాన్ ట్రాలీని ఢీకొట్టింది.వెంటనే హైవేమొబైల్ టీం స్పందించి జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి ప్రథమ చికిత్సకు తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రౌడీషీటర్‌కు రిమాండ్

జగ్గంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మల్లిసాలకు చెందిన రౌడీషీటర్ బి.కృష్ణను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. దీంతో అతడిని పెద్దాపురం సబ్‌జైలుకు తరలించారు. ఆరుగురు రౌడీషీటర్లను తహశీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.